# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 2 | సంచిక : 211 | ఎడిటర్ : వి. శ్రీనివాసరావు | పేజీలు :8 | శుక్రవారం 24 అక్టోబర్ 2025




### డేంజర్ జోన్‌లో
## ఢిల్లీ ప్రజలు

- రోజుకి 9 సిగరెట్లు తాగినంత వాయు కాలుష్యం..
- క్లౌడ్ సీడింగ్ ద్వారా కృత్రిమ వర్షాలు కురిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు
- ఇది ఇలాగే కొనసాగితే ప్రజలు క్యాన్సర్ వ్యాధి బారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు



## వికాసానికి, వినాశనానికి మధ్య పోరు

- తాను పట్నాలోనే పుట్టా.. బిహార్‌లోనే 20 ఏళ్లు గడిపా
- ఆర్జేడీ చీకటి యుగం గురించి తనకు తెలుసు
- యువతకు ఉపాధి కల్పిస్తా.. వలసలను అడ్డుకుంటా
- కేంద్ర మంత్రి నడ్డా



## బీహార్ 'గేమ్ ప్లాన్' లుకలుకలకు ఫుల్‌స్టాప్!

- మహాఘట్ బంధన్‌లో సీట్ల పంపకాలపై ఇప్పటికీ ఓ స్పష్టత కొరవడిన సంగతి తెలిసిందే
- లెక్క తేలకపోవడంతో ఎవరికివారే అభ్యర్థులను ప్రకటించుకుని నామినేషన్లు దాఖలు చేయించారు
- భాగస్వామ్య పార్టీల కీలక నేతలతో సమావేశమై సీటు పంపకాలపై నెలకొన్న సందిగ్ధాన్ని తొలగించినట్లు తెలుస్తోంది.

# అప్రమత్తం ఉండాలి



- కుండపోత వర్షం.. ప్రాణం నష్టం లేకుండా చూడాలి
- ప్రభావిత జిల్లాలకు అత్యవసర నిధులు మంజూరు
- దుబాయ్ నుంచి సీఎం చంద్రబాబు మంత్రులు, కలెక్టర్లతో సమీక్ష
- రాష్ట్రంలో ఎటు వంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు

**అమరావతి**

బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడన ప్రభావంతో రాష్ట్రం లోని పలు ప్రాంతాల్లో భారీ నుండి అతిభారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం అయింది. రాష్ట్రంలో ఎటు వంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించడం జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాలు పలువురు మంత్రులు వర్ష ప్రభావిత నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కడప, తిరుపతి జిల్లాల పరిస్థితిపై సంబంధిత జిల్లా కలెక్టర్లు, అధికారులతో సమీక్షలు నిర్వహించి అప్రమత్తం చేయడం జరిగింది. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దుబాయ్ నుంచి అధికారులతో - మిగతా3లో



### క్వాంటమ్ టెక్నాలజీ రీసెర్చ్‌కి
## సహకారం ఇవ్వండి

- నైపుణ్యాభివృద్ధిలో ఏపీ ప్రభుత్వంలోభాగస్వామ్యం వహించండి
- యూనివర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్‌ను సందర్శించిన సందర్భంగా మంత్రి లోకేష్

**ఆస్ట్రేలియా**

రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయం (యూనివర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్)ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎమ్మా జాన్స్టన్, డిప్యూటీ వైస్ ఛాన్సలర్ (గ్లోబల్, కల్చర్ అండ్ ఎంగేజ్ మెంట్) ప్రొఫెసర్ మైఖేల్ వెస్లీ, డీన్ ఆఫ్ ఆర్ట్స్ ప్రొఫెసర్ జెన్నీఫర్ బాలింట్, డీన్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ మారెక్ టెసార్, డీన్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ ఐటీ ప్రొఫెసర్ అంపలవనపిళ్లై (థాస్) నిర్మలథాస్, డీన్ ఆఫ్ సైన్స్ ప్రొఫెసర్ - మిగతా3లో



### తీరంలో అత్యంత వేగంగా
## అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఏపీ అగ్రస్థానం

రాష్ట్ర అభివృద్ధికి తీసుకుంటున్న వినూత్న పథకాలపై నివేదిక ఇవ్వండి

సీఎస్ విజయానంద్‌తోనీతి ఆయోగ్ సీఈవో బివిఆర్ సుబ్రహ్మణ్యం

దేశ తూర్పు తీరంలో అత్యంత వేగంగా అభివద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రపదేశ్ ముందుంది

### క్రెడిట్ చోరీలో చంద్రబాబు పీక్..
# పర్ఫార్మెన్స్ వీక్

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, అదానీ, కేంద్ర ప్రభుత్వం, సింగపూర్ ప్రభుత్వాల సమిష్టి కృషి ఇది
- 2023లోనే డాటా సెంటర్‌కు శంకుస్థాపన కూడా చేశాం
- రాష్ట్రాన్ని యాడ్ ఏజెన్సీలా నడిపిస్తున్నారు
- వారం, పదిరోజులుగా దీని గురించి ఆశ్చర్యం కలిగించే వార్తలు వింటున్నాం
- రాష్ట్రంలో పాలనను బాబు గాలికి ఎగిరిపోయింది
- ఏదో యాడ్ ఏజెన్సీ నడిపిస్తున్నట్లుగా కనిపిస్తోంది



**తాడేపల్లి**

వైఎస్సార్‌సీపీ వేసిన బీజానికి కొనసాగింపే విశాఖ గూగుల్ డాటా సెంటర్ అని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ క్లారిటీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, అదానీ, కేంద్ర ప్రభుత్వం, సింగపూర్ ప్రభుత్వాల సమిష్టి కృషి ఇది అని చెప్పుకొచ్చారు. 2023లోనే డాటా సెంటర్‌కు శంకుస్థాపన కూడా చేశామని వెల్లడించారు. క్రెడిట్ చోరీలో చంద్రబాబు పీక్.. పర్ఫార్మెన్స్ వీక్ అని సెటైరికల్ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రాన్ని యాడ్ ఏజెన్సీలా నడిపిస్తున్నారు అని ఘాటు విమర్శలు చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ..'గూగుల్ డాటా సెంటర్ గురించి మాట్లాడుకుందాం. వారం, పదిరోజులుగా దీని గురించి ఆశ్చర్యం కలిగించే వార్తలు వింటున్నాం. రాష్ట్రంలో - మిగతా3లో

# పవన్ మార్క్.. అభివృద్ధిలో ముందడుగు

నవంబర్ 1వ తేదీ నుంచి అందుబాటులోకి డీడీఓ ఆఫీసులు

అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలు

పంచాయతీల పాలన సంస్కరణలకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ముందడుగు



**అమరావతి**

రాష్ట్రంలో స్థానిక సంస్థలను బలోపేతం చేస్తూ పాలనాపరమైన సంస్కరణలు తీసుకువచ్చామని, వాటి ఫలాలు ప్రజలకు సక్రమంగా అందించే బాధ్యత ఉద్యోగులపై ఉందని రాష్ట్ర ఉప ముఖమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ గారు స్పష్టం చేశారు. నవంబర్ 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రాంతీయ అభివృద్ధి అధికారులు (డి.డి.ఓ.) కార్యాలయాలు ప్రారంభించాలని ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం పంచాయతీరాజ్ ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రివర్యులు సమావేశమయ్యారు. క్లస్టర్ విధానం రద్దు చేసి 13,351 - మిగతా3లో



## ట్రంప్ నుంచి తప్పించుకునేందుకే సదస్సుకు మోదీ దూరం

- 'చాలా రోజులుగా ఈ సదస్సు గురించి ఊహాగానాలు వినిపిస్తూనే ఉన్నాయి
- మోదీ దీనికోసం కౌలాలంపూర్ వెళ్తారా? లేదా? అని. ఇప్పుడు వెళ్లడం లేదని తేలిపోయింది
- మోదీ ఈ సదస్సుకు వెళ్లకపోవడానికి కారణం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా అక్కడ ఉండటమే

## మలేసియాలో ట్రంప్ - మోదీ భేటీ లేనట్లే


- ఆసియాన్ సదస్సులో వర్చువల్‌గా పాల్గొననున్న ప్రధాని
- అక్టోబరు 26 నుంచి 28 వరకు జరగనున్న ఈ సదస్సుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరుకావడం లేదు
- ఈ సమ్మిట్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహా అనేక దేశాల నాయకులు హాజరుకానున్నారు
- ప్రధాని మోదీ గైర్హాజరు నేపథ్యంలో ట్రంప్ - మోదీ భేటీ ఈసారి కూడా లేనట్లే



# డేంజర్ జోన్‌లో ఢిల్లీ ప్రజలు

**న్యూఢిల్లీ:** ఢిల్లీలో ప్రమాదకర స్థాయి వాయు కాలుష్యం కొనసాగుతోంది. దీపావళి తర్వాత రోజురోజుకీ గాలి నాణ్యత పడిపోతోంది. తాజాగా ఢిల్లీ ఆనంద్ విహార్ ప్రాంతంలో ప్రమాదకర స్థాయికి 429 పాయింట్లకు కాలుష్యం చేరింది. క్లౌడ్ సీడింగ్ ద్వారా కృత్రిమ వర్షాలు కురిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఇది ఇలాగే కొనసాగితే ప్రజలు క్యాన్సర్ వ్యాధి బారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇక, కాలుష్య కారక గాలి పీల్చడం వల్ల ఢిల్లీలో సగటున ప్రతి మనిషి రోజుకి 9 సిగరెట్లు తాగినట్లు అవుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. వారానికి 63 సిగరెట్లు, నెలకి 270 సిగరెట్లు తాగుతున్నట్లు వెల్లడించారు. ఇది ఇలాగే కొనసాగితే ప్రజలు క్యాన్సర్ వ్యాధి బారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు తెలిపారు. గత మూడు రోజులుగా తారాస్థాయికి వాయు కాలుష్యం చేరి దేశ రాజధాని గ్యాస్ ఛాంబర్‌గా మారిపోయింది. గాలి పీల్చుకునేందుకు ఢిల్లీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. మాస్క్ తప్పనిసరిగా ధరించాలని, అనవసరంగా బయట తిరగవద్దని వైద్యుల సూచనలు చేశారు. ఎయిర్ ప్యూరిఫైయర్ తప్పనిసరిగా వినియోగించాలన్నారు. కాగా, దీపావళి, పంట వ్యర్థాలు కాల్చివేత వల్ల వాయు కాలుష్యం భారీగా పెరిగింది. ఇదిలా ఉండగా.. ఢిల్లీని చుట్టుముట్టిన వాయు కాలుష్యంపై బీజేపీ సమాధానం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ ఎంపీ అభిషేక్ మనుసింఘ్వీ డిమాండ్ చేశారు. ఢిల్లీ వాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వాయు కాలుష్యం కారణంగా ప్రజలు పడే ఇబ్బందులు అంతాఇంతా కాదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. " గత మూడ్రోజులుగా





దేశ రాజధానిలో గాలి మసిబారిపోయింది. దీనిని పీల్చిన ప్రజల ఊపిరితిత్తులు పొగచూరి నల్లగా మారుతున్నాయి. ఇంత జరుగుతున్నా ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వ జవాబుదారీతనం వీసమెత్తయినా కంటికి కనిపించట్లేదు. పండగల వేళ బీజేపీ నేతలు చేసే జ్ఞానబోధనలు ఎవరికీ అక్కర్లేదు. ప్రజలు హాయిగా స్వచ్ఛమైన గాలి పీల్చగలిగేలా చేస్తామంటూ బాధ్యత తీసుకునే బాధ్యతాయుత ప్రభుత్వం కావాలి. ఢిల్లీ పొరుగు రాష్ట్రాలు కాలుష్యంతో అతలాకుతలమవుతున్నా బీజేపీ చర్యలు తీసుకోకపోవడం దారుణం" అని మనుసింఘ్వీ తన సామాజిక మాధ్యమ 'ఎక్స్' ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి గణాంకాల ప్రకారం బుధవారం ఉదయం ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో వాయు నాణ్యత సూచీ(ఏక్యూఐ) 'చాలా అధ్వానం'గా నమోదైన నేపథ్యంలో మనుసింఘ్వీ స్పందించారు.

# మలేసియాలో ట్రంప్ - మోదీ భేటీ లేనట్లే..

మలేసియాలో ఈ నెల ఆసియాన్ సదస్సు జరగనున్న విషయం తెలిసిందే. కౌలాలంపూర్‌లో అక్టోబరు 26 నుంచి 28 వరకు జరగనున్న ఈ సదస్సుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరుకావడం లేదు. ఈ విషయాన్ని ప్రధాని స్వయంగా ప్రకటించారు. ఈ సమ్మిట్‌లో వర్చువల్‌గా పాల్గొననున్నట్లు తెలిపారు. ఆసియాన్-భారత్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా బలోపేతం చేయడానికి ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఈ సదస్సు నేపథ్యంలో మలేషియాతోపాటూ కంబోడియాలో కూడా ప్రధాని పర్యటించాలని తొలుత భావించారు. అయితే, తాజాగా ఆయన ఈ సదస్సుకు వెళ్లకపోవడంతో.. కంబోడియా పర్యటన కూడా వాయిదా పడింది. ఈ సమ్మిట్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహా అనేక దేశాల నాయకులు హాజరుకానున్నారు. ప్రధాని మోదీ గైర్హాజరు నేపథ్యంలో ట్రంప్ - మోదీ భేటీ ఈసారి కూడా లేనట్లే. ఈ ఆసియాన్‌లో మలేసియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, వియత్నాం, మయన్మార్ వంటి 10 దేశాలు సభ్యదేశాలుగా ఉన్నాయి. ఈ సమ్మిట్‌లో ప్రధాని మోదీకి బదులు విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలుస్తోంది.



## ట్రంప్ కొత్త వ్యూహం..
## అతిపెద్ద రష్యా చమురు సంస్థలపై అమెరికా ఆంక్షలు!

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగించే విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా తాజాగా రష్యాకు చెందిన రెండు అతిపెద్ద చమురు కంపెనీలైన రోస్‌నెఫ్ట్, లుకోయిల్ పై ఈ ఆంక్షలు విధించారు రష్యా అధ్యక్షుడు పుతిన్ ట్రంప్‌ల భేటీ వాయిదా పడిన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకుంది. యూఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫారిన్ అసెట్స్ కంట్రోల్ ఆఫీస్ ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఉక్రెయిన్‌తో యుద్ధం ముగించడమే కాకుండా శాంతి ప్రక్రియపై రష్యాకు నిబద్ధత లేకపోవడం వల్లే ఈ ఆంక్షలు విధించినట్లు తెలిపింది. తమ నిర్ణయం ఆ దేశ చమురు రంగంపై ఒత్తిడి పెంచుతుందని, దీనివల్ల రష్యా ఆర్థికవ్యవస్థపై కూడా ప్రభావం పడుతుందని వ్యాఖ్యానించింది. శాశ్వత శాంతి పూర్తిగా రష్యా చర్చలు జరపడానికి రావడంపై ఆధారపడి ఉందని వెల్లడించింది. ట్రంప్ మాట్లాడుతూ.. ఇవి అపారమైన ఆంక్షలన్నారు. అయితే, ఇవి ఎక్కువకాలం ఉండవని, ఈలోపు యుద్ధ సమస్య పరిష్కారమవుతుందని వ్యాఖ్యానించారు. ఈ చర్యకు ఇదే సరైన సమయం అని తాను భావిస్తున్నట్లు కూడా తెలిపారు. ఈ ఆంక్షలతో యుద్ధం కారణంగా జరుగుతున్న హత్యలను ఆపడంతో పాటు తక్షణ కాల్పుల విరమణకు సమయం ఆసన్నమైందని ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ పేర్కొన్నారు. అమెరికా మిత్ర దేశాలు తమతో కలవాలని, ఆంక్షలకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. ట్రెజరీ ప్రకారం.. ఈ చర్య రష్యా తన సైనిక కార్యకలాపాలకు నిధులు సమకూర్చే సామర్థ్యం తగ్గుతుంది. దీంతో పాటు దాని




చమురు ఆధారిత ఆర్థిక వ్యవస్థ బలహీన పడుతుంది. ఇక, ఈయూ కూడా రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకు గాను 19 ఆంక్షల ప్యాకేజీకి ఆమోదం తెలిపింది. రష్యా ఎల్ఎన్‌జీపై నిషేధం విధించడం కూడా ఇందులో ఉంది.

ఇదిలాఉండగా.. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేసే విషయంపై ట్రంప్ మరోసారి మాట్లాడారు. ఈ ఏడాది చివరి నాటికి భారత్ రష్యా నుంచి చమురు దిగుమతులను భారీగా తగ్గిస్తుందన్నారు. తగ్గింపు క్రమంగా ఉంటుందని, ఇది మంచి చర్య అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మేరకు భారత్ నుంచి తనకు హామీ వచ్చిందని కూడా తెలిపారు. ఈ విషయంపై ట్రంప్ గత కొన్ని రోజులుగా సొంత ప్రకటనలు చేస్తూ వస్తుండగా.. భారత్ వాటిని ఖండిస్తుంది. అయినా, అగ్రరాజ్యం అధ్యక్షుడు మళ్లీ మళ్లీ ఇలాంటి ప్రకటనలే చేయడం గమనార్హం.

# హైదరాబాదీని రక్షించే ప్రయత్నాల్లో కేంద్రం

ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల కోసం రష్యా వెళ్లిన భారతీయులు.. బలవంతంగా సైన్యంలో చేరి ఉక్రెయిన్ యుద్ధంలో పాల్గొంటున్న సంగతి తెలిసిందే. అలా హైదరాబాద్ (తెలంగాణ)కు చెందిన ఓ వ్యక్తి చిక్కుకుపోగా.. అతన్ని రక్షించాలంటూ భాధిత కుటుంబం కేంద్రాన్ని ఆశ్రయించింది. దీంతో కేంద్రం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ అహ్మద్(37) ఈ ఏడాది ఏప్రిల్‌లో రష్యాకు వెళ్లాడు. ఓ నిర్మాణ సంస్థలో భాగంగా పని ఉందంటూ ఏజెంట్ నమ్మబలికి అతన్ని అక్కడికి పంపించాడు. అయితే నెలపాటు అహ్మద్ ఏపని లేకుండా ఖాళీగా ఉన్నాడు. అడిగితే.. రేపో మాపో పని చెబుతామంటూ నిర్వాహకులు చెప్పసాగారు. ఈలోపు.. అహ్మద్‌లా ఇతర దేశాల నుంచి వచ్చిన మొత్తం 30 మందిని జమ చేసి ఉక్రెయిన్ సరిహద్దు ప్రాంతానికి తరలించారు. అక్కడ బలవంతంగా వాళ్లకు ఆయుధ శిక్షణ ఇప్పించి.. యుద్ధంలోకి దింపారు. వాహనంలో తరలిస్తున్న క్రమంలో ఇదే అదనుగా అహ్మద్ దూకి పారిపోయే ప్రయత్నం చేశాడు. ఆ ప్రయత్నంలో అతని కాలికి గాయం కావడంతో రష్యా సైన్యానికి చిక్కాడు. యుద్ధం చేయాల్సిందేనని, లేకుంటే తామే చంపేసి డ్రోన్ దాడుల్లో చనిపోయినట్లు చిత్రీకరిస్తామని బెదిరించారు. దీంతో గత్యంతరం లేక రష్యా తరఫున ఉక్రెయిన్ యుద్ధంలో అహ్మద్ పాల్గొంటున్నాడు. అయితే తన దగ్గర ఉన్న ఫోన్‌తో జరిగిందంతా ఓ సెల్ఫీ వీడియోగా తీసి భార్య అఫ్షా బేగంకు పంపాడు. అందులో.. తాను ఎదుర్కొన్న పరిస్థితులన్నీ వివరిం చాడు. నాతో పాటు ఉన్న 26 మంది మేం యుద్ధంలో పాల్గొనమని చెప్పాం. అందులో నలుగురు భారతీయులు ఉన్నారు. వాళ్లు నా మెడపై తుపాకీ పెట్టి.. యుద్ధం చేస్తావా? చస్తావా? అని బెదిరించారు. నా కాలికి గాయమైనా కనికరిం చకుండా హింసించారు. ఇప్పటికే 17 మంది మరణించారు. అందులో ఓ భారతీయుడు కూడా ఉన్నాడు. ఉద్యోగాల పేరిట బలవంతంగా ఈ నరకంలోకి మమ్మల్ని లాగారు. ఎట్టిపరిస్థితుల్లో మమ్మల్ని ఇక్కడకు పంపిన ఏజెంట్‌ను(ముంబైకి చెందిన కన్సల్టెన్సీ) వదలొద్దు అని అహ్మద్ ఆ వీడియోలో చెప్పాడు.




ఈ వీడియో ఆధారంగా అహ్మద్ భార్య అఫ్షా బేగం కేంద్ర విదేశాంగ శాఖకు ఓ లేఖ రాసింది. తన భర్త తమ కుటుంబానికి ఆధారమని, ఆయన్ని రక్షించాలని విదేశాంగ మంత్రి జై శంకర్‌ను ఉద్దేశిస్తూ వేడుకుంది. మరోవైపు.. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని సైతం కలిసి సాయం చేయాలని కోరింది. దీంతో.. ఆయన అహ్మద్‌ను వెనక్కి రప్పించాలంటూ కేంద్రానికి, రష్యాలోని భారత రాయబార కార్యాలయానికి విజ్ఞప్తి చేశారు. అహ్మద్ భార్య, హైదరాబాద్ ఎంపీ ఒవైసీ విజ్ఞప్తులతో కేంద్రం కదిలింది. అహ్మద్ గురించి వివరాలు సేకరించి విడిపించే ప్రయత్నం చేస్తామని మాస్కోలోని భారత రాయబార సిబ్బంది తడు మాము హామీ ఇచ్చారు. భారత విదేశాంగ శాఖ లెక్కల ప్రకారం.. రష్యా ఆర్మీలో 27 మంది భారతీయులు చిక్కుకుపోయారని, వారిని రక్షించే ప్రయత్నాలు చేస్తున్నామని, వాళ్ల కుటుంబాలతో నిరంతరంగా సంప్రదింపులు జరుపుతున్నామని చెబుతోంది.

## వికాసానికి, వినాశనానికి మధ్య పోరు



బిహార్ ఎన్నికలను ఎన్డీయే 'వికాసానికి', ఇండియా కూటమి 'వినాశనానికి' మధ్య జరుగుతున్న పోరుగా భాజపా అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా పేర్కొన్నారు. భాగస్వామ్య పక్షాలను అంతం చేసే పరాన్నజీవి పార్టీగా కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. లాలూ ప్రసాద్ యాదవ్ నేతృత్వంలోని ఆర్జేడీ.. రంగ్‌దారీ (దోపిడీ), జంగల్‌రాజ్ (ఆటవిక పాలన), దాదాగిరీ (దౌర్జన్యం)లకు ప్రతీక అని విమర్శించారు. బిహార్‌లోని ఔరంగాబాద్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. తాను పట్నాలోనే పుట్టానని, బిహార్‌లోనే 20 ఏళ్లు గడిపానని.. ఆర్జేడీ చీకటి యుగం గురించి తనకు తెలుసని కేంద్ర మంత్రి నడ్డా పేర్కొన్నారు. యువతకు ఉపాధి కల్పిస్తామని, వలసలను అడ్డుకుంటామని తేజస్వీ యాదవ్ ఇచ్చిన హామీలు.. 'భూమికి ఉద్యోగం కుంభకోణం'లో ఆర్జేడీ ప్రమేయాన్ని గుర్తుచేస్తున్నాయన్నారు. మాజీ గ్యాంగ్‌స్టర్ షహబుద్దీన్ తనయుడు ఒసామాకు రఘునాథ్‌పుర్ నుంచి టికెట్ ఇవ్వడంపై మండిపడ్డారు. బిహార్ విషయంలో ఆ పార్టీకి ఎంత శ్రద్ధ ఉందో ఇది తేటతెల్లం చేస్తోందన్నారు. తేజస్వీ యాదవ్ ఆచరణలో సాధ్యం కాని హామీలు ఇస్తున్నారని భాజపా ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు. "2.6 కోట్ల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని తేజస్వీ చెబుతున్నారు. దీనికి రూ.12 లక్షల కోట్లు అవసరం అవుతాయి. రాష్ట్ర మొత్తం బడ్జెట్ దాదాపు రూ.3 లక్షల కోట్లు. మరి ఎక్కడి నుంచి ఉద్యోగాలు కల్పిస్తారు?" అని ఓ మీడియా సమావేశంలో ప్రశ్నించారు. ఓటర్లకు ఆర్జేడీ తప్పుడు వాగ్దానాలు ఇస్తోందని, ఆ పార్టీని రాష్ట్ర ప్రజలు విశ్వసించరని చెప్పారు.

## బీహార్ 'గేమ్ ప్లాన్'
## లుకలుకలకు పుల్‌స్టాప్!



బీహార్‌లో గ్రాండ్ అలయన్స్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్జేడీ అగ్రనేత తేజస్వీ యాదవ్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించేందుకు అంగీకారం తెలిపింది. సీనియర్ నేత అశోక్ గెహ్లాత్ చొరవతో కూటమి పార్టీలు ఏకాభిప్రాయానికి వచ్చినట్లు కథనాలు వెలువడుతున్నాయి. మహాఘట్ బంధన్‌లో సీట్ల పంపకాలపై ఇప్పటికీ ఓ స్పష్టత కొరవడిన సంగతి తెలిసిందే. లెక్క తేలకపోవడంతో ఎవరికివారే అభ్యర్థులను ప్రకటించుకుని నామినేషన్లు దాఖలు చేయించారు. ఈ క్రమంలో పలు స్థానాల్లో మిత్రపక్షాల అభ్యర్థుల మధ్యే పోటీ నెలకొంది. అయితే దీనిని 'ఫ్రెండ్లీ పోటీ'గా అభివర్ణించుకున్న ఆర్జేడీ-కాంగ్రెస్‌లు.. మరో పక్క ఢిల్లీ పెద్దలతో సంప్రదింపులు జరుపుతూనే ఉన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ గెహ్లాత్, మాజీ ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేష్ బఘేల్ ప్నాట్నాలో నిన్నంతా బిజీబిజీగా గడిపారు. భాగస్వామ్య పార్టీల కీలక నేతలతో సమావేశమై సీటు పంపకాలపై నెలకొన్న సందిగ్ధాన్ని తొలగించినట్లు తెలుస్తోంది. మొత్తంగా 8 స్థానాల్లో పోటీ స్నేహపూర్వకంగా ఉండాలని నిర్ణయించుకు న్నారని, మరీ ముఖ్యంగా తేజస్వి యాదవ్‌ను సీఎం అభ్యర్థిగా ప్రకటించేందుకు కాంగ్రెస్ అంగీకరించినట్లు జాతీయ మీడియా సంస్థలు కథనాలు ఇచ్చాయి. కాంగ్రెస్ ఎంపీ అఖిలేష్ సింగ్ ఇప్పటికే ఈ విషయాన్ని ధృవీకరించారు. నేత దీపంకర్ భట్టాచార్య త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడుతుందని అన్నారు.

## ట్రంప్ నుంచి తప్పించుకునేందుకే
## సదస్సుకు మోదీ దూరం



మలేసియాలో జరగనున్న ఆసియాన్ సమ్మిట్‌కు ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకావడం లేదనే సంగతి తెలిసిందే. దీంతో మోదీ లక్ష్యంగా కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నుంచి తప్పించుకునేందుకే ఆయన ఈ సమావేశానికి వెళ్లడం లేదంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'చాలా రోజులుగా ఈ సదస్సు గురించి ఊహాగానాలు వినిపిస్తూనే ఉన్నాయి. మోదీ దీనికోసం కౌలాలంపూర్ వెళ్తారా? లేదా? అని. ఇప్పుడు వెళ్లడం లేదని తేలిపోయింది. అంటే ప్రపంచ నాయకులను ఆలింగనం చేసుకొని ఫొటో తీసుకోవడంతో పాటు తనని తాను విశ్వగురువుగా చాటుకొనే అవకాశం కోల్పోయారు. మోదీ ఈ సదస్సుకు వెళ్లకపోవడానికి కారణం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా అక్కడ ఉండటమే. కొన్ని వారాల క్రితం ఈజిప్టులో జరిగిన గాజా శాంతి సమావేశానికి కూడా మన ప్రధాని హాజరుకాలేదు. ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించిన కారణంగా.. ఆయనపై ప్రశంసలు కురిపిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు. కానీ, ట్రంప్ ఆపరేషన్ సిందూర్‌ను తానే ఆపానని 53 సార్లు.. రష్యా చమురును భారత్ కొనుగోలు నిలిపివేసిందని ఐదుసార్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ట్రంప్‌తో కలవకుండా మోదీ జాగ్రత్త పడుతున్నారు' అని విమర్శించారు. మలేసియాలో ఈనెల 26 నుంచి 28 వరకు ఆసియాన్ సదస్సు జరగనుంది. దీనికి ట్రంప్‌తో సహా ప్రపంచ నాయకులు హాజరుకానున్నారు. ఇందులో మోదీ వర్చువల్‌గా పాల్గొననున్నారు. విదేశాంగ మంత్రి జై శంకర్ అక్కడ భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు.

# క్రెడిట్ చోరీలో చంద్రబాబు పీక్.. పర్ఫార్మెన్స్ వీక్

-మొదటిపేజీ తరువాయి

పాలనను బాబు గాలికి ఎగిరిపోయింది. ఏదో యాడ్ ఏజెన్సీ నడిపిస్తున్నట్లుగా కనిపిస్తోంది. క్రెడిట్ చోరీలో చంద్రబాబు పీక్.. రాష్ట్ర పరిస్థితి వీక్. వేరే వాళ్లకి దక్కాల్సిన క్రెడిట్‌ను చోరీ చేయడంలో బాబు ఎప్పుడూ ముందుంటారు. ఏపీలో 2020లో కరోనా టైంలోనే అదానీ డాటా సెంటర్ ఒప్పందానికి బీజం వేశాం. 2023 మే 3న.. ఆ తర్వాత డాటా సెంటర్‌కు శంకుస్థాపన కూడా చేశాం. సింగపూర్ నుంచి సబ్‌సీ కేబుల్ తీసుకొచ్చే ప్రయత్నం చేశాం. దీనికి కొనసాగింపుగానే గూగుల్ డాటా సెంటర్ వచ్చింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, అదానీ, కేంద్ర ప్రభుత్వం, సింగపూర్ ప్రభుత్వాల సమిష్టి కృషి ఇది. వైఎస్సార్‌సీపీ వేసిన బీజానికి కొనసాగింపే విశాఖ గూగుట్ డాటా సెంటర్ ఇది. వేరేవాళ్లకి క్రెడిట్ ఇవ్వడం చంద్రబాబుకి ఇష్టం ఉండదు.. అందుకే కొన్ని విషయాలు దాస్తున్నారు. అదానీ ప్రాజెక్టు విస్తరణే ఈ గూగుల్ డాటా సెంటర్. వైజాగ్‌లో అదానీ ఇన్‌ఫ్రాకు చెందిన కంపెనీలే గూగుట్ డాటా సెంటర్‌ని నిర్మిస్తున్నాయి. చంద్రబాబు మాటలు కోటలు దాటుతున్నాయని అన్నారు.

**అదానీ గూగుల్ మధ్య వ్యాపార సంబంధాలు..**

ప్రపంచంలోనే అతిపెద్ద గూగుల్ డాటా సెంటర్ వైజాగ్‌కి రాబోతోంది. వైఎస్సార్‌సీపీ వేసిన విత్తనమే ఇది. వేరేవాళ్లకి క్రెడిట్ ఇవ్వడం చంద్రబాబుకి ఇష్టం ఉండదు.. అందుకే కొన్ని విషయాలు దాస్తున్నారు. అదానీ గూగుల్ మధ్య వ్యాపార సంబంధాలున్నాయ్. అదానీ ప్రాజెక్టు విస్తరణే ఈ గూగుల్ డాటా సెంటర్. అదానీ ఇందులో రూ.87 వేల కోట్ల పెట్టుబడి పెడుతున్నారు. వైజాగ్‌లో అదానీ ఇన్‌ఫ్రాకు చెందిన కంపెనీలే గూగుట్ డాటా సెంటర్‌ని నిర్మిస్తున్నాయి. ఇందుకు



సంబంధించి.. ఐటీ సెక్రటరీ భాస్కర్‌కు గూగుల్ ప్రతినిధి లేఖ కూడా రాశారు. చంద్రబాబు కనీసం అదానీకి కృతజ్ఞతలు కూడా చెప్పలేదు. వైఎస్సార్‌సీపీకి ఆ ఘనత దక్కుతుందనే.. బాబు ఆ పని చేయడం లేదు' అని తెలిపారు.

గూగుల్ డేటా సెంటర్‌ను నిర్మించేది అదానీనే. జగన్ సర్కార్ వల్లే డేటా సెంటర్ వచ్చిందని చెప్పలేకపోయారు.క్రెడిట్ ఇవ్వడం చంద్రబాబుకు ఇష్టం లేదు. బాబును చూసి గూగుల్ వచ్చినట్టుగా బిల్డప్ ఇస్తున్నారు. డేటా సెంటర్‌తో ఉద్యోగాలు పెద్దగా రావు. కానీ, ఎకో సిస్టమ్ బిల్డు అవుతుంది. భవిష్యత్‌లో పెద్ద మార్పులకు డేటా సెంటర్ కీలకం. డేటా సెంటర్‌తో పెద్దగా ఉద్యోగాలు రావు కాబట్టి.. ఐటీ పార్క్, రిక్రియేషన్, స్కిల్ సెంటర్ పెట్టాలని ఆలోచన చేశాం. 25వేల మందికి ఉద్యోగాలు కూడా ఇవ్వాలని ఒప్పందం కూడా చేశాం. ఎఫిషియన్సీలో చంద్రబాబు వీక్.. క్రెడిట్ చోరీలో పీక్' అని సెటైర్లు వేశారు.

**హైదరాబాద్ అభివృద్ధిలో బాబుకు సంబంధమే లేదు: వైఎస్ జగన్**

హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబుకు అసలు సంబంధమే లేదన్నారు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్. హైదరాబాద్ అంతా తానే కట్టినట్టు బాబు బిల్డప్ ఇస్తారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ వచ్చాక హైదరాబాద్ రాత మారిపోయిందని తెలిపారు. క్రెడిట్ ఇవ్వకపోవడమన్నది బాబు దుర్మార్గపు నైజం అంటూ ఘాటు విమర్శలు చేశారు. 'హైదరాబాద్ సైబర్ టవర్స్ విషయంలోనూ చంద్రబాబు ఇలాగే చేశారు. దాని పేరే హైటెక్ సిటీ. ఆరు ఎకరాల్లో హైటెక్ సిటీకి పునాది వేసింది నేదురుమల్లి జనార్దన్. కానీ, చంద్రబాబు ఆ విషయాన్ని ఏనాడూ చెప్పుకోరు. హైదరాబాద్ అంతా తానే కట్టినట్టు బాబు బిల్డప్ ఇస్తారు. 2004, 2009లో వైఎస్సార్ విజయం సాధించారు. 20 ఏళ్ల పాటు బాబుకు, హైదరాబాద్‌కు సంబంధమే లేదు. కానీ, ఈ మధ్య జరిగిన అభివృద్ధి అంతా నాదే అని చంద్రబాబు అంటారు. 2004లో వైఎ?స్సార్ ఓఆర్ఆర్ ఫేజ్-1 ప్రారంభించారు. వైఎస్సార్ వచ్చాక హైదరాబాద్ రాత మారిపోయింది. ఆ తర్వాత ఆ అభివృద్ధి అలా కొనసాగింది. పీవీ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మించింది వైఎస్సారే. మహానేత వైఎస్సార్ హయాంలోనే జీఎంఆర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నిర్మాణం. బాబు దిగిపోయే నాటికి ఐటీ ఎక్స్‌పోర్ట్స్ 5650 కోట్లు. అదే వైఎస్సార్ వచ్చాక 2008-09 ఐటీ ఎగుమతులు 32509 కోట్లకు చేరింది. 2013-14లో ఐటీ ఎగుమతులు 57000 కోట్లుగా ఉంది. కేసీఆర్ కూడా గొప్ప పరిపాలన అందించారు. కేసీఆర్ రెండుసార్లు సీఎం చేశారు.. అప్పుడూ డెవలప్‌మెంట్ జరిగింది. కానీ, ఈ క్రెడిట్ అంతా నాదేనని బాబు చెప్పుకుంటారు. క్రెడిట్ ఇవ్వకపోవడమన్నది బాబు దుర్మార్గపు నైజం' అని విమర్శలు చేశారు.

# తీరంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఏపీ అగ్రస్థానం

**అమరావతి :** పూర్వోదయ పథకం, విశాఖపట్నం గ్రోత్ హబ్ పై గురువారం ఎపి సచివాలయంలో నీతి ఆయోగ్ సిఇఓ బి విఆర్ సుబ్రహ్మణ్యం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తో సమావేశమై చర్చించారు. ఈసందర్భంగా నీతి ఆయోగ్ సిఇఓ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దేశ తూర్పు తీరంలో అత్యంత వేగంగా అభివద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రపదేశ్ ముందుందని పూర్వోదయ పథకం ద్వారా తీరప్రాంతంలో మరింత అభివద్ధికి అవకాశాలు ఉన్నాయని తెలిపారు.ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ లో పలు ఓడరేవులు ఉన్నప్పటికీ ప్రత్యేకంగా ఒక కంటైనర్ మెగాపోర్టు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆదిశగా తగిన ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వానికి సూచించారు.అదే విధంగా రానున్న చీఫ్ సెక్రటరీల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివద్ధికి తీసుకుంటున్న వినూత్న పథకాలపై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చేందుకు వీలుగా తగిన నివేదికను సిద్ధం చేసుకోవాలని సిఎస్ విజయానంద్ కు ఆయన సూచించారు.అనంతరం విశాఖపట్నం,అమరావతి,తిరుపతి గ్రోత్ కారిడార్ల ఏర్పాటు తద్వారా జరిగే అభివద్ధి ప్రయోజనాలపై ఆయన చర్చించారు. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ విశాఖపట్నం గ్రోత్ హబ్ పనులు వేగవంతం చేసేందుకు ప్రత్యేకంగా ఒక అధికారిని ఇన్చార్జిగా నియమించడం జరుగుతుందని చెప్పారు. రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టులను వేగవతంగా ముందుకు తీసుకువెళ్ళడం తోపాటు అనేక నూతన ప్రాజెక్టులు, పరిశ్రమలు ఏర్పాటు అయ్యేలా ప్రభుత్వం పెద్దఎత్తున ప్రయత్నాలు చేస్తోందని వివరించారు.కేంద్రం నుండి వివిధ ప్రాజెక్టులు,పథకాలకు సకాలంలో తగిన నిధులు మంజూరు



అయ్యేలా కషి చేయడం జరుగుతోందని కేంద్రం నుండి తగిన నిధులు మంజూరు అయ్యేలా నీతి ఆయోగ్ సిఫార్సు చేయాలని సిఎస్ విజయానంద్ నీతి ఆయోగ్ సిఇఓ సుబ్రహ్మణ్యంకు విజ్ఞప్తి చేశారు. కాగా పూర్వోదయ అనేది దేశ తూర్పుతీరంలోని ఆంధ్రప్రదేశ్,ఒడిస్సా,పశ్చిమ బెంగాల్, ఝూర?ండ్,బీహార్ ఐదు రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఒక వినూత్న పథకం.ఇది సాంస్కతిక వారసత్వం మరియు సహజ వనరులను ఉపయోగించుకోవడం,కొత్త మౌలిక సదుపాయాలను సష్టించడం,ఉపాధిని సష్టించడం మరియు స్థిరమైన ఆర్థికవద్ధిని ప్రోత్సహించడం ద్వారా తూర్పు భారతదేశాన్ని జాతీయ పురోగతికి కీలకమైన చోదకంగా మార్చాలనే లక్ష్యంతో పూర్వోదయ పథకాన్ని చేపట్టడం జరిగింది. దీనిద్వారా పెద్దఎత్తున రహదారులు వంతెనలు, విమానాశ్రయాలు,విద్యుత్ ప్లాంట్లు వంటి ముఖ్యమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టడం జరుగుతుం ది. ఈ ప్రాజెక్టులు ప్రాంతీయ కనెక్టివిటీని మెరుగుపర చడానికి, పారిశ్రామికాభివద్ధికి మరింత దోహద చేస్తాయి. అంతేగాక పూర్వోదయ విద్యా మరియు నైపుణ్య%-%అభివద్ధి సంస్థలను బలోపేతం చేయడానికి ప్రాధాన్యత ఇస్తుంది.అర్హత కలిగిన శ్రామిక శక్తిని సిద్ధం చేయడానికి ఐఐటి ఇతర నైపుణ్య-శిక్షణా కేంద్రాల్లో సామర్థ్య విస్తరణ కూడా దోహద పడుతుంది. పూర్వోదయ పథకం వ్యవసాయం, అనుబంధ రంగాల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు,ఉద్యోగ అవకాశా లు, నైపుణ్యాభివద్ధిని పెంపొందిస్తుంది.అంతేగాక పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటుకు మద్దతు ఇవ్వడం తోపాటు పెట్టుబడులను ప్రోత్సహిస్తూ వ్యవసాయం, మత్స్య సంపద వంటి రంగాల్లో విలువ జోడింపును ప్రోత్సహిస్తుంది. సమతుల్య ప్రాంతీయ అభివద్ధి సమ్మిళిత వద్ధిని ప్రోత్సహిస్తుంది మరియు భారతదేశం అంతటా ఆర్థిక అసమానతలను తగ్గిస్తుంది. మెరుగైన కనెక్టివిటీ మరియు పారిశ్రామిక సామర్థ్యం తూర్పు రాష్ట్రాలను ఎగుమతులు మరియు స్థిరమైన ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రాలుగా ఉంచుతాయి. ఈసమావేశంలో నీతి ఆయోగ్ అదనపు సీఈవో పార్థసారధి రెడ్డి,రాష్ట్ర ఆర్థిక, ప్రణాళికల శాఖల ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్, విద్యాశాఖ కార్యదర్శి కె.శశిధర్, ఆర్థికశాఖ కార్యదర్శి వినయ్ చంద్,ప్రణాళికాశాక జెఎస్ అనంత శంకర్,నైపుణ్యాభివద్ధి సంస్థ ఎండి జి.గణేశ్ కుమార్ పాల్గొన్నారు

# బయిటకు రా...
# కేడర్‌లో ఒక్కటే డిమాండ్

**విజయవాడ :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఎక్కువ సమయం బెంగళూరులోనే ఉంటున్నారు. ఇప్పటికే 2024 ఎన్నికల్లో ఓటమి పాలయి దాదాపు రెండేళ్లకు దగ్గరపడుతుంది. ఇప్పటి కైనా బెంగళూరు వదిలి తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో నేతలకు, ముఖ్యమైన కార్యకర్తలకు అందుబాటులో ఉండాలన్న డిమాండ్ ఎక్కువగా వినపడుతుంది. నెలలో ఇరవై నాలుగు రోజులు బెంగళూరులోనే జగన్ ఉంటున్నారు. కేవలం ఆరు రోజులు మాత్రమే తాడేపల్లికి వస్తున్నారు. అదీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకో.. నేతలతో సమావేశమవ్వ డానికో ఆయన వస్తున్నారు. కానీ ఇకపై లాభం లేదని, ఇప్పటికే సమయం మించి పోయిందని, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదవుతున్నాయని, నేతలు కూడా బయటకు ఇంకా రావడం లేదని, దీనికి ప్రధాన కారణం జగన్ ఇక్కడ ఉండకపోవడమేనన్న అభిప్రాయం కార్యకర్తల్లో బలంగా కనిపిస్తుంది.. కానీ రాయలసీమలో అతి తక్కువ సార్లు మాత్రమే జగన్ పర్యటించారు. నిజానికి ఓటు బ్యాంకు, వైసీపీకి పట్టున్న రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు. రాయలసీమలో వైసీపీ నేతల మధ్య సఖ్యత కొరవడింది. ఇప్పటి నుంచే సీట్ల కోసం కొందరు ప్రయత్నిస్తున్నారు. మరికొందరు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. పటిష్టమైన క్యాడర్ ఉన్న రాయలసీమను అలా వదిలేస్తే రానున్న కాలంలో ఎలా అన్న ప్రశ్న వినపడుతుంది. జగన్ మాత్రం ఇంకా టైముందని



చెబుతున్నారు. కానీ అప్పటికి నష్టం తీవ్రత మరింత పెరిగే అవకాశముందన్న ఆందోళన పార్టీ నేతల్లో కనిపిస్తుంది. క్షేత్ర స్థాయిలో నాయకత్వం... నిజానికి ఇప్పటి వరకూ పార్టీకి క్షేత్రస్థాయిలో సరైన నాయకత్వం లేదన్నది వాస్తవం. నియోజకవర్గాల్లో బూత్ లెవెల్ కమిటీలను నియమించాలని కొద్దిరోజుల క్రితం జగన్ నేతలను ఆదేశించినప్పటికీ అవి కార్యరూపం దాల్చలేదు. చాలా నియోజకవర్గ ఇన్ ఛార్జుల విషయంలోనూ ఇంకా జగన్ నుంచి క్లారిటీ లేదు. గత ఎన్నికల్లో నియోజకవర్గాలను మార్చారు. అయితే అక్కడ గత ఎన్నికల్లో పోటీ చేసిన నేతలు వెళ్లడం లేదు. మరొకవైపు జోగి రమేష్ వంటి నేతలు తాము మైలవరంలో వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటించుకుంటున్నారు. ఇలాంటి సమయంలో జగన్ బయటకు వస్తేనే తప్ప ఈ సమస్యలకు తెరపడదు. కానీ ఆయన బెంగళూరు వదిలి రాకపోవడంతో క్యాడర్ కు అదే బెంగ పట్టుకుందంటున్నారు.

## అప్రమత్తం ఉండాలి

-మొదటిపేజీ తరువాయి

మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. వర్ష ప్రభావిత నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కడప, తిరుపతి జిల్లాల పరిస్థితిపై సీఎస్ మరియు ఆర్టీజీ అధికారుల నుంచి సమాచారం సేకరించి, యంత్రాంగం అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభావిత ప్రాంతాలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్ బందాలను పంపించాలని సూచిస్తూ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా రెవెన్యూ, డిజాస్టర్, పోలీస్, ఇరిగేషన్, మున్సిపల్, ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎం సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, కాలువలు మరియు చెరువుల గట్లు బలహీనంగా ఉన్న చోట్ల పటిష్ట పరచాలని ఆదేశించారు. అంతేకాక, అంటువ్యాధులు వ్యాపించకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కూడా ముఖ్యమంత్రి సూచించారు. ఎడతెరిపి లేని వర్షాల నేపథ్యంలో మంత్రి పి. నారాయణ మున్సిపల్ కమిషనర్లను అప్రమత్తం చేశారు. మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, డైరెక్టర్ సంపత్ కుమార్, ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తూ, వర్షాల కారణంగా ప్రజలకు ఇబ్బందులు కాకుండా అన్ని అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత విజయవాడలో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైందని తెలిపారు.

## క్వాంటమ్ టెక్నాలజీ రీసెర్చ్‌కి సహకారం ఇవ్వండి



-మొదటిపేజీ తరువాయి

మోయిరా ఓ'బ్రియన్ తదితర ఎగ్జిక్యూటివ్ లు లోకేష్ కు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా క్వాంటమ్ పరిశోధనలు, ఉపాధ్యాయ శిక్షణపై వర్సిటీ ఉన్నతస్థాయి బందంతో మంత్రి లోకేష్ చర్చించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎమ్మా జాన్సన్ మాట్లాడుతూ... 1853లో స్థాపితమైన మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయం ఆస్ట్రేలియాలో అగ్రస్థానంలో ఉందని చెప్పారు. క్యూఎస్ ప్రపంచ విశ్వవిద్యాలయ ర్యాంకింగ్స్ 2025లో అంతర్జాతీయంగా 13వ స్థానాన్ని సంపాదించిందని తెలిపారు. ప్రస్తుతం 55వేల మందికి పైగా విద్యార్థులు తమ యూనివర్సిటీలో చదువుతున్నారని అన్నారు. పరిశోధన, విద్యా నాణ్యత, సామాజిక భాగస్వామ్యం రంగాల్లో పేరొందిన తమ విశ్వవిద్యాలయం... ఆవిష్కరణలు, ప్రపంచ భాగస్వామ్యాలు, స్థిరత్వం, సామాజిక ప్రభావం వంటి అంశాలపై దష్టిసారించిందని తెలిపారు. మెల్‌బోర్న్ నగరంలో ఐదు క్యాంపస్ లతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాం. అంతర్జాతీయ సహకారంపై కేంద్రీకతమైన ప్రపంచ వ్యూహంతో తాము ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, విశ్వవిద్యాలయాలతో కలిసి కత్రిమ మేధస్సు, సైబర్ సెక్యూరిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి అధునాతన సాంకేతికలపై స్థిరమైన పద్ధతుల్లో నైపుణ్యాభివద్ధి కార్యక్రమాలను రూపొందించాలని కోరారు. క్వాంటమ్ టెక్నాలజీ రీసెర్చ్ కు సహకరించాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో రెన్యువబుల్ ఎనర్జీ, వ్యవసాయం, ఆరోగ్య రంగాల్లో సంయుక్త పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేసి రాష్ట్రాభివద్ధి లక్ష్యాలను సాధించడంలో భాగస్వామ్యం వహించండి. స్థానిక సంస్థలను భాగస్వాములుగా చేసి డిజిటల్ హెల్త్ సొల్యూషన్స్, టెలీ మెడిసిన్ ద్వారా ఆరోగ్య సేవలను మెరుగుపర్చేందుకు సహకారం అందించాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.

## పవన్ మార్క్.. అభివృద్ధిలో ముందడుగు

-మొదటిపేజీ తరువాయి

గ్రామ పంచాయతీలను స్వతంత్ర యూనిట్లు చేయడం ద్వారా గ్రామీణులకు మెరుగైన సేవలు అందించే వెసులుబాటు తీసుకువచ్చామని ఉప ముఖ్యమంత్రివర్యులు చెప్పారు. పల్లెల్లో కనీస మౌలిక వసతుల కల్పనకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పంచాయతీలు, గ్రామీణాభివద్ధికి నిధులు సమకూరుస్తున్నామని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులతోపాటు పంచాయతీలు ఆర్థిక స్వయం ప్రతిపత్తి సాధించే విధంగా సరికొత్త ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. నిధులు సమకూర్చడంలోను, పాలనాపరమైన సంస్కరణల్లోనూ కూటమి ప్రభుత్వం ఎంతో సానుకూల దక్పథంతో ఉందనీ... ఆ ఫలితాలు ప్రజలకు చేర్చి పల్లెల అభివద్ధిలో ఉద్యోగులు క్రియాశీలక బాధ్యత తీసుకోవాలన్నారు. నిధుల వినియోగం, పాలన సంస్కరణల అమలుపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సమీక్షలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. పల్లె పండగ 2.0 ద్వారా గ్రామాల్లో చేపట్టే అభివద్ధి కార్యక్రమాలపై పూర్తి ప్రణాళిక అందించాలని ఆదేశించారు.

## వర్మ షిఫ్టింగ్ తప్పదా




**కాకినాడ :** పిఠాపురం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్.ఎన్. వర్మ రాజకీయ ప్రస్థానం ఎటూ అర్థం కాకుండా ఉంది. జనసేనాని పవన్ కల్యాణ్ కోసం తన స్థానాన్ని త్యాగం చేసిన వర్మకు ఇచ్చే ప్రాధాన్యత ఇదేనా? అన్న ప్రశ్న వర్మ వర్గీయుల నుంచి వినపడుతుంది. పిఠాపురం నియోజకవర్గాన్ని పవన్ కల్యాణ్ దాదాపు ఫిక్స్ చేసుకున్నట్లే కనపడుతుంది. పిఠాపురం నియోజకవర్గాన్ని పవన్ వదలిపెట్టే అవకాశం ఎంత మాత్రం లేదు. ఎందుకంటే పవన్ తన అడ్డాగా నియోజకవర్గాన్ని మార్చుకుంటున్నారు. నిజానికి పవన్ కల్యాణ్ ఎన్నికయిన తర్వాత ఈ నియోజకవర్గానికి కొంత ఇమేజ్ ఏర్పడింది. అక్కడ భూముల ధరలు కూడా పెరిగాయి. అదేసమయంలో అక్కడ ఓటు బ్యాంకు కూడా పవన్ అక్కడే ఫిక్స్ అయ్యేలా చేసేటట్లే కనపడుతుంది. మరి మాజీ ఎమ్మెల్యే వర్మ పరిస్థితి ఏంటన్నది మాత్రం ఎటూ తేలకుండా ఉంది. వర్మ పిఠాపురం నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన నేత కావడంతో పాటు టీడీపీలో కూడా కీలకమైన నేత. 2024 ఎన్నికలకు ముందు పవన్ కల్యాణ్ కోసం త్యాగం చేసినందుకు వర్మకు ఎమ్మెల్సీ పదవి ఇస్తానని అప్పుడే పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. కూటమి ధర్మంతో పాటు జగన్ ను ఓడించాలన్న లక్ష్యంతో వర్మ కూడా పవన్ కల్యాణ్ విజయానికి కృషి చేశారు. అంతవరకూ బాగానే ఉంది కానీ, కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత మాత్రం పిఠాపురం నియోజకవర్గంలో టీడీపీ, జనసేన స్థానిక నేతల మధ్య మాత్రం సఖ్యత లేదు. టీడీపీ నేతలను కట్టడి చేశామని చెప్పినప్పటికీ వర్మకు ఎలాంటి పదవి రాకపోవడం కొంత అసంతృప్తి వర్మ అనుచరుల్లో ఉంది.ఇక ఇటీవల మంత్రి నారాయణ చేసిన వ్యాఖ్యలపై కూడా వర్మ అనుచరులు గరంగరంగా ఉన్నారట. నారాయణ తాను ఆ మాట అనలేదని సర్ది చెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వర్మను జీరో చేశామని టీడీపీ చెప్పడం వెనక ఇక భవిష్యత్ లో ఏ పదవి దక్కదని చెప్పకనే చెప్పినట్లయిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. వర్మకు అక్కడ ఎమ్మెల్సీ పదవో మరే పదవి ఇచ్చినా పిఠాపురం నియోజకవర్గంలో మరో పవర్ సెంటర్ ఏర్పడుతుందని, అప్పుడు పవన్ కల్యాణ్ కు, తమకు గ్యాప్ ఏర్పడే అవకాశముందని పార్టీ నాయకత్వం వర్మకు భవిష్యత్ లోనూ ఏ పదవి దక్కే అవకాశముండకపోవచ్చని అంటున్నారు. మొత్తం మీద ఈ టర్మ్ లో మాత్రం వర్మ మాజీ ఎమ్మెల్యేగానే మిగిలిపోక తప్పదంటున్నారు.

## సంపాదకీయం

# సమతుల్య ఆహారంతోనే ఆరోగ్యం

మనిషి జీవితానికి మూలం ఆహారం. జీవన శక్తి, ఆరోగ్యం, ఆయుష్షు అన్నీ ఆహారం పైనే ఆధారపడి ఉంటాయి. ఆరోగ్యకరమైన, పోషక విలువలతో కూడిన ఆహారం మన శరీరానికి శక్తినిస్తుంది, మనసుకు సమతుల్యతను ప్రసాదిస్తుంది. ఈ ఆహార ప్రాధాన్యతను గుర్తుచేసే రోజే జాతీయ ఆహార దినోత్సవం. ప్రతి సంవత్సరం అక్టోబర్ 24న దేశ వ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని జరుపు కుంటారు. దీని ప్రధాన ఉద్దేశ్యం ప్రజల్లో ఆరోగ్యకరమైన ఆహారం, పోషకాహారం, ఆహార భద్రత పట్ల అవగాహన కల్పించడం. ప్రపంచ వ్యాప్తంగా అక్టోబర్ 16న ప్రపంచ ఆహార దినోత్సవం జరుపుకుంటారు. ఇది 1945లో ఐక్యరాజ్య సమితి ఆహార మరియు వ్యవసాయ సంస్థ స్థాపనకు గుర్తుగా ప్రారంభమైంది. భారతదేశం దీనికి విస్తరణగా అక్టోబర్ 24న జాతీయ ఆహార దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. భారతదేశం స్వాతంత్ర్యం అనంతరం తీవ్ర ఆహార కొరతను ఎదుర్కొంది. 1950–60 దశకాల్లో దేశ ఆర్థిక పరిస్థితి దెబ్బతింది. ఆహార ధాన్యాల దిగుమతులపై ఆధారపడిన పరిస్థితి నెలకొంది. ఈ సంక్షోభం దృష్ట్యా ప్రభుత్వం 1965లో హరిత విప్లవం కార్యక్రమాన్ని చేపట్టి వ్యవసాయోత్పత్తిని గణనీయంగా పెంచింది. 1970 నాటికి భారత్ ఆహార స్వావలంబన సాధించింది. 1951లో దేశవ్యాప్తంగా ఉత్పత్తి అయిన ధాన్యం 51 మిలియన్ టన్నులుగా ఉండగా, 2023 నాటికి అది 329 మిలియన్ టన్నులకు చేరింది. గోధుమ, వరి, జొన్న, మక్క వంటి ధాన్యాల ఉత్పత్తిలో ప్రపంచంలో భారత్ టాప్ త్రయంలో స్థానం పొందింది. కానీ ఉత్పత్తి పెరిగినా ప్రజల్లో పోషకాహార లోపం ఇంకా తీవ్రమైన సమస్యగానే ఉంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం భారత దేశంలో ఐదేళ్ల లోపు పిల్లల్లో 35.5 శాతం వృద్ధి తగ్గిన వారు, 32.1 శాతం బరువు తక్కువగా ఉన్నవారు, మహిళల్లో 57 శాతం రక్తహీనతతో బాధపడు తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ శాతం మరింత ఎక్కువగా ఉంది. ఇది మన ఆహార అలవాట్లు, పోషక విలువల లేమి, ఆహార విద్య కొరత కారణంగా ఏర్పడిన దుస్థితి. మన ఆహారపు పద్ధతులు కాలక్రమేణా విపరీతంగా మారాయి. తరం మార్పుతో పాటు ఫాస్ట్ ఫుడ్, ప్రాసెస్డ్ ఆహారాలు, ప్యాకేజ్డ్ పదార్థాల వాడకం పెరిగింది. పూర్వం గృహాల్లో సిద్ధం చేసే సహజ ఆహారం స్థానంలో నేడు జంక్ ఫుడ్‌కి ప్రాధాన్యం పెరిగింది. దీని ఫలితంగా ఊబకాయం, డయాబెటిస్, హైపర్ టెన్షన్, హృద్రోగాలు వంటి జీవనశైలి జనిత వ్యాధులు విస్తరించాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2023 నివేదిక ప్రకారం భారత దేశంలో 20 నుండి 40 ఏళ్ల మధ్య వయస్సు గల యువతలో 25 శాతం మందికి పైగా ఊబకాయ సమస్యతో బాధపడు తున్నారు. అదే సమయంలో పిల్లల్లో డయాబెటిస్ కేసులు కూడా గత దశాబ్దంలో రెండింతలు పెరిగాయి. ఈ నేపథ్యంలో జాతీయ ఆహార దినోత్సవం మనకు ఒక మేలుకొలుపు పిలుపు. ఆహారం కేవలం శారీరక అవసరం కాదు, అది ఒక సామాజిక, సాంస్కృతిక అంశం కూడా. భారతీయ ఆహార సంస్కృతి ప్రకృతితో ముడిపడి ఉంటుంది. తినే ముందు భోజనానికి నమస్కరించడం, పచ్చిమిరప, ఉప్పు, పెరుగు, నిమ్మరసం వంటి వాటిని సమతుల్యంగా వాడటం మన సాంప్రదాయం. ఉదయం తేలికపాటి ఆహారం, మధ్యాహ్నం పూర్తి భోజనం, రాత్రి తక్కువ భోజనం అనే పద్ధతి వైద్యపరమైన ఆధారాలపై నిర్మితమైంది. ఇవన్నీ మన పూర్వీకుల శాస్త్రీయ ఆహార చైతన్యానికి నిదర్శనం. భారతదేశంలో ప్రభుత్వం కూడా పోషకాహార లోపం నివారణ కోసం పలు కార్యక్రమాలు చేపట్టింది. 1975లో ప్రారంభమైన ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్, 1995లో ప్రారంభమైన మిడ్డే మీల్ స్కీమ్, 2018లో ప్రవేశపెట్టిన పోషణ అభియాన్, 2021లో ప్రారంభమైన పోషణ 2.0 వంటి కార్యక్రమాలు పిల్లల, గర్భిణీ స్త్రీల, వృద్ధుల పోషక భద్రతకు సహకరించాయి. ఈ చర్యల వల్ల కొంతవరకు మెరుగుదల ఉన్నా, ఇంకా ప్రతి మూడు పిల్లల్లో ఒకరు పోషకాహార లోపంతో ఉన్నారు. ప్రపంచ వ్యాప్తంగా "సుస్థిర ఆహార వ్యవస్థ" అనే భావన ప్రాముఖ్యం పొందుతోంది. భవిష్యత్ తరాలకు సరిపడా ఆహారం అందేలా పర్యావరణానికి నష్టం కలగకుండా ఉత్పత్తి చేయడం దీని ప్రధాన లక్ష్యం. దీనిలో భాగంగా భారతదేశం సేంద్రియ వ్యవసాయం, చిరుధాన్యాల ఉత్పత్తి, నీటి సంరక్షణ, వ్యర్థాల పునర్వినియోగం వంటి పద్ధతులను ప్రోత్సహిస్తోంది. 2023ను ఐక్యరాజ్య సమితి "అంతర్జాతీయ మిల్లెట్ సంవత్సరం"గా ప్రకటించడం ద్వారా చిరుధాన్యాల ప్రాధాన్యం ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపును పొందింది. రాగి, జొన్న, కొర్ర వంటి చిరుధాన్యాలు రక్తంలో చక్కెర నియంత్రణకు, జీర్ణక్రియకు, రోగనిరోధకశక్తి పెరుగుదలకు ఎంతో ఉపకరిస్తాయి. జాతీయ ఆహార దినోత్సవం సందర్భంగా ప్రజలు తమ ఆహార అలవాట్లను సమీక్షించుకోవాలి. తినే ఆహారం శరీరానికి ఎంత ఉపయోగ పడుతుందో తెలుసుకోవాలి. తల్లిదండ్రులు పిల్లలలో పోషకాహారం ప్రాధాన్యాన్ని చిన్నప్పటి నుంచే అలవాటు చేయాలి. పాఠశాలలు, కళాశాలలు ఈ దిశగా ఆహార విద్యను భాగంగా చేర్చాలి. ఫాస్ట్ ఫుడ్‌కు బదులు సహజ ధాన్యాలు, పండ్లు, కూరగాయలు, పాలు, పప్పు దినుసులు ఎక్కువగా తీసుకోవడం అలవాటు చేయాలి. మన దేశంలో "ఆహారం అన్నదానం" అనే భావన శతాబ్దాల చరిత్ర కలిగినది. తినడం పట్ల కృతజ్ఞత భావం, ఆహారాన్ని పంచడం పట్ల మనసులో ఉన్న మనోభావం మన సంస్కృతిలో అంతర్లీనంగా ఉంటుంది. అదే ఆత్మను ఈ దినోత్సవం మళ్లీ మేలుకొల్పుతుంది.ఆరోగ్యకరమైన ఆహారం అంటే ఖరీదైనది కాదు ა సమతుల్యమైనది, సహజమైనది, స్వచ్ఛమైనదే ఆరోగ్యమయమైనది. మన శరీరం అవసరానికి మించి తినకపోవడం, తినే సమయాన్ని క్రమబద్ధంగా ఉంచడం కూడా ఆరోగ్యానికి మేలే. అక్టోబర్ 24న జరుపుకునే జాతీయ ఆహార దినోత్సవం మనందరినీ ఒక సత్యం వైపు దృష్టి సారింపజేస్తుంది ა మన ఆహారమే మన ఆరోగ్యం, మన ఆరోగ్యమే మన దేశం యొక్క సంపద. సరైన ఆహారం తీసుకోవడం అంటే మన జీవన ప్రమాణాన్ని మెరుగు పరచడమే. ప్రతి మనిషి ఆహారంపై అవగాహన పెంచుకుంటేనే ఆరోగ్యవంతమైన భారతదేశం నిర్మాణం సాధ్యమవుతుంది. ఆహారాన్ని పూజించే భారతీయ సంస్కృతిలో ఈ దినోత్సవం ఒక పునర్జీవనం లాంటిదని చెప్పవచ్చు. పోషక ఆహారం – పరిపూర్ణ ఆరోగ్యం, అదే జాతీయ ఆహార దినోత్సవం నిజమైన సందేశం.

# జర్నలిస్టులకు ఆదర్శం జిఎస్ వరదాచారి



వయోధిక పాత్రికేయులు, వయోధిక పాత్రికేయ సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు, జి. ఎస్. (గోవర్ధన సుందర) వరదాచారి నిబద్ధత కలిగిన జర్నలిస్టు, ఎందరో గ్రామీణ జర్నలిస్టులకు మార్గ నిర్దేశనం చేశారు. చాలా మంది జర్నలిస్టులకు దిక్కూ, దిక్సూచి. వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్, హౌసింగ్ సొసైటీ , ఫిలిం క్రిటిక్స్ అసోసియేషన్ తో పాటు తెలుగు యూని వర్సిటీలో కూడా తన సేవలను అందించారు. జి.ఎస్. వరదాచారి సీనియర్ తెలుగు భాషా సినీ విమర్శకుడు, పాత్రికే యులు.1988లో పదవీ విరమణ చేసే వరకు ఆంధ్రభూమి పత్రికకు సహ సంపాదకుడిగా ఉన్నారు. వరదాచారి 1932, అక్టోబరు 24న నిజామాబాదు జిల్లాలోని ఆర్మూరులో జన్మించారు. నిజాం పాలనలో బాల్య మంతా గడిపిన వరదాచారి, ఉస్మానియా విశ్వ విద్యాలయం లో డిగ్రీ, పి.జి. డిప్లమా ఇన్ జర్నలిజం చదివారు. తరువాత కొంతకాలం 'ది హిందూ' పత్రికలో ఇంటర్న్‌షిప్ చేశారు. 'కృష్ణా పత్రిక'ను తొలిసారిగా చదివిన వరదాచారి ఆ పత్రికకు పాఠకులుగా మారి, 1948లో ఆంధ్ర జనత పత్రికతో తన జర్నలిజం వృత్తిని ప్రారంభించారు. జర్నలిజం డిగ్రీతో ప్రవేశించిన అతికొద్ది మంది జర్నలిస్టులలో వరదాచారి ఒకరు. నాన్ ముల్కీ సంఘటనలు, ఆంధ్రప్రదేశ్ అవతరణ తరువాత జరిగిన చరిత్రకు ప్రత్యక్ష సాక్షిగా ఉన్న వరదాచారి రాసిన సంపాదక లేఖగా పంపిన 'స్వతంత్ర' అనే రచనను పత్రిక వ్యాసం రూపంలో ప్రచురించింది. అదే ఆయన తొలివ్యాసం. ఆంధ్రభూమి, ఈనాడు పత్రికల్లో జర్నలిస్టుగా పని చేశారు. తెలుగు భాషోద్యమ సమాఖ్య ఉపాధ్యక్షుడిగా ప్రభుత్వంలో తెలుగు భాష వినియోగం కోసం పోరాడారు. తెలుగు విశ్వ విద్యాలయంలో జర్నలిజం విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాత్రికేయ రంగంలో తెలుగు విశ్వ విద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. పత్రకార్ శిరోమణి బిరుదు (మొట్ట మొదటి హిందీ పత్రిక ఉదంత మార్తాండ్ 150వ వార్షికోత్సవం సందర్భంగా 1976, నవంబరు 26న కోల్‌కతాలో జరిగిన సర్వ భాష పత్రకార్ సమ్మేళనంలో), దాసరి గోల్డ్ మెడల్ ఉత్తమ ఫిల్మ్ జర్నలిస్ట్, (1986), పత్రికా రచనాచార్య బిరుదు (అక్టోబర్ 24, 1992న షష్టిపూర్తి కార్యక్రమంలో కిన్నెర సంస్థ), తెలుగు విశ్వవిద్యాలయం జర్నలిజంలో ప్రతిభా పురస్కారం (1999), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి ఉత్తమ జర్నలిస్ట్‌గా విఆర్ నార్ల జీవన సాఫల్య పురస్కారం – 2005, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి ఉగాది పురస్కారం (2006), తెలుగు విశ్వ విద్యాలయం గౌరవ పురస్కారం (26 ఫిబ్రవరి 2007) అందుకున్నారు. 1956 జూన్ నుండి – 1961 మార్చి వరకు ఆంధ్ర జనత పత్రికలో అసిస్టెంట్ ఎడిటర్ గా, 1961నుండి 1982 వరకు ఆంధ్రభూమి దినపత్రికలో... న్యూస్ ఎడిటర్ గా విశ్రాంతులు (చాలాకాలం 'ఆయనే ఆంధ్రభూమి, ఆంధ్రభూమే ఆయన' అనే పేరు ఉండేది), 1983 నవంబర్ 21నుండి 1988 డిసెంబర్ 26 వరకు ఈనాడు దినపత్రిక ఉప సంపాదకులుగా,1963–64 జర్నలిస్టుల సహకార గృహ నిర్మాణ సంఘం అధ్యక్షుడుగా, 1964–1966 ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ ప్రధాన కార్యదర్శిగా, 1980–1981 అధ్యక్షులుగా, 1980–81 ప్రెస్ క్లబ్ స్థాపక కార్యదర్శిగా, 1975–78 ఎ.పి. సినీగోయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, 1977 నుంచి. జర్నలిస్ట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా, రచన జర్నలిజం కళాశాల నిర్వహణ మండలి సభ్యత్వం కలిగి, 23 డిసెంబర్ 1988 డిసెంబర్ 23 నుండి సుదీర్ఘ కాలం తెలుగు విశ్వ విద్యాలయంలో జర్నలిజంలో విజిటింగ్ ప్రొఫెసర్ గా పని చేశారు. రాష్ట్ర ప్రభుత్వ చలన చిత్ర సబ్సిడీ కమిటీ ఉన్నంత కాలం (1976–78) సభ్యత్వం,. జాతీయ చలన చిత్రాభివృద్ధి సంస్థ వారి స్క్రిప్టు కమిటీ సభ్యత్వం, తెలుగు అకాడమీ వారి పరిపాలనా న్యాయ పదకోశం – సలహా సంఘ సభ్యత్వం – 1981 రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాంస్కృతిక వ్యవహారాల రాష్ట్ర సలహా మండలి సభ్యత్వం 1981. ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ సభ్యత్వం – 1999–2001 నందీ చలన చిత్రాల అవార్డుల కమిటీ సభ్యత్వం కలిగి ఉన్నారు. ఇలాగేనా రాయడం, దిద్దుబాటు , నార్ల వెంకటేశ్వరరావు , మన పాత్రికేయ వెలుగులు, జ్ఞాపకాల వరద, నూరేళ్ళ పత్రికా రచన, తెలుగు పత్రికల పుట్టుక ... తదితర రచనలతో పాటు జర్నలిజం కోర్సు పుస్తకాలు కూడా రాశారు. ఇందిరాగాంధీ ఓపెన్ యూనివర్సిటీ పి.జి.డిప్లొమా విద్యార్థుల కోసం భారత రాజ్యాంగం– డా. బి.ఆర్. అంబేద్కర్, పాఠ్యాంశం, సార్వత్రిక విశ్వ విద్యాలయం వారికోసం పత్రికా చట్టాలు పాఠ్యాంశం రాశారు. అనేక పుస్తకాలకు సంపాదక మండలి సభ్యులుగా (పత్రికా పదకోశం) ఉన్నారు. రేడియో టీవీలలో అనేక ప్రసంగాలు, చర్చా గోష్ఠులు, తదితర కార్యక్రమాలతో బాటు పొలికేక, ప్రజాతంత్ర, తరుణ, కిరీటి వంటి తెలుగు పత్రికలలో, స్కైలైన్ ఇంగ్లీషు దిన పత్రికలో సినిమా శీర్షిక నిర్వహించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం, తిరుపతి మహిళా విశ్వ విద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయం, జర్నలిజం బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యత్వం కలిగి ఉన్నారు. నిజాన్ని నిర్భయంగా చెప్పటం ఆయన నైజం. తెలుగు దినపత్రికల్లో వస్తున్న భాషా దోషాలను, సంపాదకీయాల్లో దొర్లే గుణదోషాలను ఎత్తి చూపే ఒక శీర్షికను దిద్దుబాటు పేరుతో ఎంవిఆర్ శాస్త్రి సంపాదకత్వంలో నిర్వహించగా, ఆయన నాలుకకు పదును ఎక్కువ కాగా, తమ కలానికీ ఉన్న పదును ఎలాంటిదో చూపారు. 2022 నవంబర్ 3న వరదాచారి ఈ లోకాన్ని వదిలి వెళ్లారు. వరదాచారికి హర్ష, శ్రీవాత్సవ ఇద్దరు కుమారులు, శుభ, సౌమ్య ఇద్దరు కుమార్తెలు. ధర్మపురి క్షేత్ర వైష్ణవ కుటుంబీకులు సరోజనను వివాహం చేసుకున్న వరదాచారి, తన కుమారునికి మళ్ళీ అదే కుటుంబ సంబంధం అమ్మాయిని కోడలుగా చేసుకోవడం ద్వారా క్షేత్రంతో విడదీయని సంబంధ బాంధవ్యాలు ఏర్పడ్డాయి. అలా సీనియర్ జర్నలిస్ట్ రామచంద్ర మూర్తి ద్వారా వరదాచారిని కలుసుకునే భాగ్యం పురాకృత సుకృతంగా నేను భావిస్తాను.

# సేవా నిరతికి ప్రతిరూపం





కెప్టెన్ లక్ష్మీ సెహగల్ (అక్టోబర్ 24, 1914... జూలై 23, 2012) ప్రముఖ సంఘ సేవకురాలు, రాజ్యసభ సభ్యురాలు. ఆమె భారత రాష్ట్రపతి పదవికి పోటీ చేసిన తొలి మహిళ. ఆమె తండ్రి స్వామినాథన్ మద్రాసులో ప్రముఖ న్యాయవాది. ఆమె బ్రిటిష్ ఇండియాలోని మలబార్, మద్రాస్ ప్రెసిడెన్సీలో 1914 అక్టోబర్ 24న జన్మించారు. ఆమె తండ్రి స్వామి నాథన్, తల్లి అమ్ముకుట్టి/ అమ్ము. తల్లి ఎ.వి.అమ్ము కుట్టి సామాజిక సేవా కార్యకర్త. చిన్నతనం లోనే సెహగల్ విదేశీ వస్తు బహిష్కరణ, మద్య నిషేధం వంటి జాతీయ పోరా టాలలో పాల్గొన్నారు. 1938 లో మద్రాసు వైద్య కళాశాలలో ఎం.బి., బి.ఎస్. గైనకాలజీ పూర్తయిన తరువాత 1940లో సింగపూర్ వెళ్లడానికి ముందు చెన్నైలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్‌గా పని చేశారు. అక్కడ భారతీయ నిరుపేదల వాడలో వైద్యశాల స్థాపించి, స్థానికంగా ఉన్న భారతీయ కార్మికులకు సేవలందించారు. అక్కడ ఆమె ఉన్న సమయంలో, భారత జాతీయ సైన్యం సభ్యులను కలిసే అవకాశం లభించింది. భారత స్వాతంత్ర్య పోరాటంలో చురుకైన పాత్ర పోషించడం ప్రారంభించారు. ఆమె 1941లో ప్రముఖ స్వాతంత్ర్య సమరయ యోధుడు రాష్ బెహారీ బోస్ ఏర్పాటు చేసిన ఇండియన్ ఇండిపెండెన్స్ లీగ్‌లో చేరారు. 1943 లో సుభాష్ చంద్రబోస్ సింగపూర్ వచ్చినప్పుడు భారత స్వాతంత్ర్యం కోసం పోరాడటానికి ఒక మహిళా రెజిమెంట్ ప్రారంభిం చడం గురించి మాట్లాడారు. ఆ సమయంలో లక్ష్మీ సెహగల్ సుభాష్ తో సమావేశ మయ్యారు. నేతాజీ నుండి 'రాణి ఆఫ్ ఝాన్సీ' రెజిమెంట్‌ను స్థాపించడానికి ఆదేశాన్ని పొందారు. ఆయన స్థాపించిన ఇండియన్ నేషనల్ ఆర్మీ ఆధ్వర్యంలోని ఝాన్సీ రెజిమెంట్ కు ప్రాతినిధ్యం వహించారు. అలా ఆమె కెప్టెన్ లక్ష్మిగా మారి సేవలు అందించారు. డాక్టర్‌గా వైద్య సేవలు కూడా అంద జేశారు. ఆమెను 1945 లో బ్రిటిష్ సైన్యం అరెస్టు చేసింది. 1946 వరకు బర్మాలో ఉంచింది. ఆ తర్వాత ఆమెను ఇండియన్ నేషనల్ ఆర్మీ ట్రయల్స్ జరుగుతున్న సమయం లోనే ఇండియాకు పంపించారు. లక్ష్మీ సెహగల్ 1947లో లాహోర్ కు చెందిన కర్నల్ ప్రేమ్ కుమార్ సెహగల్ ను లాహోర్‌లో వివాహం చేసుకొని కాన్పూర్ లో స్థిరపడి కాన్పూర్ ప్రజలకు వైద్య సేవలం దించారు. స్వాతంత్ర్యా నంతరం ఆల్ ఇండియా డెమొక్రటిక్ ఉమెన్స్ అసోషియేషన్ (ఐద్వా) ఉపాధ్యక్షు రాలిగా వివిధ స్థాయిలలో సమాజ సేవకు అంకిత మయ్యారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, 1971లో లక్ష్మీ సెహగల్ కమ్యునిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్)... సిపిఎంలో చేరిన ఆమె జీవితాంతం వరకు క్రియాశీలక సభ్యురాలిగా కొనసాగారు. 1971లో, సీపీఎం పక్షాన లక్ష్మీ సెహ్‌గల్ రాజ్యసభ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. బంగ్లాదేశ్ సంక్షోభ సమయంలో, ఆమె బంగ్లాదేశ్ నుండి భారత దేశానికి వచ్చిన శరణార్థుల సంరక్షణలో సహాయ పడ్డారు.1981లో ఏర్పాటైన ఆల్ ఇండియా డెమోక్రటిక్ ఉమెన్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుల్లో ఆమె కూడా ఒకరు. అక్టోబరు %శ్రీ%984లో, శ్రీమతి ఇందిరా గాంధీ హత్య నేపథ్యంలో నగరంలో సిక్కు వ్యతిరేక అల్లర్లు చెలరేగినప్పుడు, ఆమె సిక్కు కుటుంబాలకు రక్షణగా నిలిచారు. తన ఆసుపత్రి సమీపంలో ఉన్న దుకాణాలకు, దుకాణదారులకు హాని జరగనివ్వలేదు. 1984 లో, గ్యాస్ విషాదం తర్వాత ఆమె వైద్య బృందంతో భోపాల్‌కు వెళ్లి సేవలు అందించారు. 1998లో ఆమెకు పద్మ విభూషణ్ పురస్కారం ప్రదానం చేయబడింది. 2002 లో జరిగిన రాష్ట్రపతి ఎన్నికల్లో ఎపిజే అబ్దుల్ కలాంకు వ్యతి రేకంగా వామపక్షాల మద్దతుతో వామపక్షాల అభ్యర్థిగా బరిలోకి దిగారు. అయితే కలాం ఎన్నికల్లో విజయం సాధించారు. సామ్యవాదం, సామ్రాజ్య వాద వ్యతిరేకత, సమానత్వం, లౌకికవాదం, సామాజిక న్యాయం, మహిళా సాధికారత వంటి ఆదర్శాలకు ఆమె జీవితాంతం కట్టుబడి ఉన్నారు. 97 సంవత్సరాల వయసులో లక్ష్మీ సెహ్‌గల్ 2012, జూలై 23న కాన్పూర్‌లో మరణించారు. ఆమె మృతదేహాన్ని కాన్పూర్ మెడికల్ కాలేజీకి దానం చేశారు.

## 42 శాతంతో ఏం ప్రయోజనం?

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% కాదు 50% ఇచ్చినా మళ్లీ ఈయన గెలిచాక అయ్యా అంటూ రెడ్డి దగ్గరకే పోవాలి. అసెంబ్లీ, పార్లమెంట్ మొత్తం అగ్రవర్ణాలు ఆక్రమించుకొని బీసీలకు గ్రామ పంచాయతీ లెవెల్లో 42% ఇస్తే ఏంది 50% ఇస్తే ఏంది? 50% పైన ఉన్న బీసీలు గ్రామ పంచాయతీల్లో ఉండాలి, 10% కూడా లేని అగ్రవర్ణాలు అసెంబ్లీ, పార్లమెంట్లో ఉండాలి. బీసీలు ఎప్పుడైతే రెడ్లకు, దొరలకు జై కొట్టడం, జోకడం ఆపి ఆలోచించడం మొదలు పెడతారో అప్పుడే బీసీలు సామాజికంగా, రాజకీయంగా ముందుంటారు. మా రెడ్డి దొర ఇంతా, మా రెడ్డి సాబ్ అంతా అని ఆకాశానికి ఎత్తడం ఆపి అసలు మా జనాభా ఎంత, మాకు రావలసిన వాటా ఎంత అని ఆలోచించి అడగడం మొదలు పెట్టండి. ఇప్పుడూ బీసీలకు ఇచ్చే 42% వాటాకు కూడా రెడ్డి, దొరనే అడ్డుపడుతున్నాడు అని బీసీ సమాజం తెల్సుకోవాలి. జోకుడుతనం బంజేసుకోండి, ఆలోచించే తత్వం, ప్రశ్నించే తత్వం అలవాటు చేసుకోండి. జోకుడు రాజకీయాలు ఎప్పుడూ నిన్ను ఒకడి కింద బానిసగానే ఉంచుతాయి. 50% ఉన్న మనల్ని 10% లేని వాళ్లు తరాలుగా మనల్ని పాలించడం ఏంది? మనకు రాజ్యం కావాలి మనకు మన వాటా కావాలి అని చదువుకున్న వాడిగా ఎప్పుడైతే ఆలో చిస్తావో అప్పుడే అసలైన ఉద్యమం. మనకు కావాల్సింది చట్టసభలో మన వాటా. అసెంబ్లీ, పార్లమెంట్‌లో మా వాటా ఎంత? అని ప్రశ్నించిన నాడు అసలైన బీసీ ఉద్యమం మొదలవుతుంది. బీసీల సామాజిక, విద్యా, ఆర్థిక, రాజకీయ స్థితుల్లో గత 77 ఏండ్లుగా ఆశించిన మార్పు జరగలేదు. ఇప్పుడు తాజాగా తెలంగాణలో స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన అంశం తెరమీదికి వచ్చింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆర్డినెన్స్ ద్వారా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కావడం దాదాపు అసంభవం. ఎట్టి పరిస్థితుల్లోనూ మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని చట్టం చెబుతోంది. 2019 ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు 26.19 శాతం, బీసీలకు 23 శాతం రిజర్వేషన్లను అమలు పరిచారు. ఇప్పుడు బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలని తీర్మానించారు. 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఇవ్వడానికి వీల్లేదని చట్టం కరాఖండిగా చెబుతూ ఉంటే ఆర్డినెన్స్ ద్వారా అమలు చేస్తామని బీసీలను మభ్య పెడుతున్నారు. నిజానికి ఈ ఆర్డినెన్స్ జారీ చేయడానికి కూడా రాజ్యాంగం ఒప్పుకోదు. ఎందుకంటే ఏదైనా అంశం రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నట్లయితే అదే అంశంపై గవర్నర్ ఆర్డినెన్స్ జారీ చేయడానికి వీల్లేదని చట్టం చెబుతున్నది. ఇప్పటి వరకు ఒక్క తమిళనాడు మినహా ఏ రాష్ట్రంలోనూ రిజర్వేషన్లు 50 శాతానికి మించి అమలు కావడం లేదు. ఇటీవల ఝార?ండ్ రాష్ట్రం పెంచడానికి ప్రయత్నిస్తే కూడా దానికి అనుమతి లభించలేదు.

# విద్యార్థిపై దాడి చేసిన ఉపాధ్యాయుడిపై చర్యలు ఎక్కడ

**ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి**

బద్వేల్ నియోజకవర్గం, రిపోర్టర్ శివారెడ్డి (శుభోదయం న్యూస్):

బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థి సుశాంత్ ని రక్త గాయాలు అయ్యేలా ప్లాస్టిక్ పైపుతో కొట్టిన తెలుగు ఉపాధ్యాయుడు నారాయణస్వామి ని చర్యలు ఎక్కడ? అని గురువారం కడప నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎస్.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి అన్నారు

**ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....**

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారిని ప్రయోజకులను చేయాల్సిన ఉపాధ్యాయులే విద్యార్థులను రక్తం వచ్చేలాగా కొట్టడం చాలా దారుణం అని వారు అన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు నడవడికలు నేర్పే ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల కక్ష్య పూరితంగా వ్యవహరిస్తూ రాక్షసులుగా ప్రవర్తిస్తున్న సంఘటనలు జిల్లాలో రోజు రోజుకు అధికమవుతున్నాయి అని వారు అన్నారు. విద్యార్థులపై దాడి చేసిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలల్సిన జిల్లా అధికారులు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు మళ్ళీ మళ్ళీ జరుగుతున్నాయన్నారు. విద్యార్థిని రక్త గాయాలు అయ్యేలా కొట్టిన ఉపాధ్యాయుడిపై విద్యార్థులతో కలిసి




ఆందోళన చేస్తే ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి విద్యార్థి పక్షాన నిలబడి విద్యార్థికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేసిన నాయకులపై పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి, తోటి ఉపాధ్యాయులు వీర నారాయణ, ప్రభాకర్, విద్యార్థిపై దాడి చేసిన ఉపాధ్యాయుడు నారాయణ స్వామి లు పోలీసు కేసు పెట్టడం సిగ్గు చేటు అన్నారు. సభ్యసమాజం తల దించుకొనేలా ప్రవర్తించి విద్యార్థిపై దాడి చేసిన ఉపాధ్యాయుడిని అందుకు సహకరించిన తోటి ఉపాధ్యాయులపై చర్యలు తీసుకొని వారిని వెంటనే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మోహన్, జిల్లా కమిటీ సభ్యులు అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

# లబో దిబో మంటున్న మొక్కజొన్న పండించిన రైతులు





బద్వేల్ నియోజకవర్గం, రిపోర్టర్ శివారెడ్డి (శుభోదయం న్యూస్):

కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలంలో చౌదరి వారి పల్లి పంచాయతీలో జి నరసింహాపురం గ్రామంలో అక్కడి రైతులు సుమారుగా 200 ఎకరాల మొక్కజొన్న సాగు చేస్తున్నారు.. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అక్కడ మొక్కజొన్న పండించిన రైతులు మొక్కజొన్నను కోసి రోడ్డుమీద వేయగా భారీ వర్షాల కారణంగా అవి తడిచి నష్టపోయారు.. మండలంలో ఉన్న అగ్రికల్చర్ అధికారులు వాటిని పరిశీలించి తక్షణమే ప్రభుత్వానికి తెలియజేసి నష్టపరిహారం వచ్చే విధంగా ఆదుకోవాలని రైతులు కోరుకుంటున్నారు...

## అధికారులతో కలిసి పెద్ద చెరువును పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

బద్వేల్ నియోజకవర్గం, రిపోర్టర్ శివారెడ్డి (శుభోదయం న్యూస్):



బ్రహ్మ సాగర్ నుండి వచ్చే నీటితో నిండు కుండలా పెద్ద చెరువు నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న చెరువులను నింపడానికి ప్రణాళికలు చెరువుల మరమ్మత్తు విషయం జిల్లా కలెక్టర్ అనుమతులు తీసుకుంటాం. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో బ్రహ్మ సాగర్ రిజర్వాయర్ నుంచి వచ్చే నీటితో నిండిన బద్వేల్ పెద్ద చెరువును గురువారం నాడు బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ తెలుగు గంగ ప్రాజెక్ట్ చీఫ్ ఇంజనీర్, ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, తెలుగు గంగ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..... బ్రహ్మ సాగర్ నుండి వచ్చే నీటితో పెద్ద చెరువు నిండుకుండలా నిండడం సంతోషదాయకమన్నారు. కరువు తాండవించే రాయలసీమలో కూటమి ప్రభుత్వ పాలనలో ప్రాజెక్టులన్నీ నీటితో పరవళ్ళు తొక్కుతున్నాయన్నారు. గొలుసు కట్టు చేరువైన పెద్ద చెరువు నుంచి నియోజకవర్గంలోని చెరువుల అన్నింటిని నింపడం పై అధికారులతో చర్చించారు. పెద్ద చెరువు నుంచి విడుదల చేసే నీటితో అన్ని చెరువులు నిండాలని ఏదైనా చెరువుకు మరమ్మత్తులు అవసరమైతే జిల్లా కలెక్టర్ అనుమతులు తీసుకొని మరమ్మత్తులు చేయాలని అధికారులకు సూచించారు. నేల రాలే ప్రతి నీటి బొట్టును ఒడిచిపట్టి రైతుల పంటలకు ప్రాణం పోయాలన్నారు..

## శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం

బద్వేల్ నియోజకవర్గం, రిపోర్టర్ శివారెడ్డి (శుభోదయం న్యూస్):

బ్రహ్మంగారిమఠం మండలంలోని స్థానిక శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్) వాలంటీర్ల ఆధ్వర్యంలో కళాశాల కరస్పాండెంట్ డా. డి.ఎల్ రవీంద్రారెడ్డి,మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ కే వల్లి నిర్వహణలో ఎన్ఎస్ఎస్ అధికారులు రామకృష్ణ, ఆచార్య ఎన్ వెంకట్రాంరెడ్డి,డాక్టర్ రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ ముండ్లపాటి చంద్ర శేఖర్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ గురు స్వప్న ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపును నిర్వహించడం జరిగింది అందులో భాగంగా ఈరోజు జంగంరాజు పల్లె పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించి పరిసరాల్లో ఉన్న పిచ్చి మొక్కలను కంపచట్లను ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి ఆ ప్రాంతాన్ని విద్యార్థులు శుభ్రం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ ఆఫీసర్ మాట్లాడుతూ జాతీయ సేవా




పథకం ఆధ్వర్యంలో తమ విద్యార్థుల చేత ఏడు రోజులపాటు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థులకు అటు గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కలిగిస్తూ పరిసరాలను శుభ్రపరుస్తూ వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా ఈరోజు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బాల సుబ్బయ్య,వీర లక్ష్మి,శారద, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని పరిసరాలను శుభ్రపరిచారు

## రితీష్ రెడ్డి తోనే బద్వేల్ టిడిపికి పూర్వ వైభవం

**టిడిపి మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి..**

బద్వేల్ నియోజకవర్గం, రిపోర్టర్ శివారెడ్డి (శుభోదయం న్యూస్):

కడప జిల్లా బద్వేల్ నియోజకవర్గంలో టిడిపికి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చే శక్తిసామర్థ్యాలు రితీష్ రెడ్డికే ఉన్నాయని గోపవరం మండలం టిడిపి అధ్యక్షులు సుధాకర్ రెడ్డి మీడియాతో అన్నారు. టిడిపి పార్టీ ప్రారంభం నుంచి పార్టీ కోసం అహర్నిశల కృషి చేస్తున్న దివంగత మంత్రి బిజీ వేముల వీరారెడ్డి గారి కుటుంబానికి బద్వేల్ ప్రజలు మద్దతు ఎప్పటికీ ఉంటుందన్నారు.. పార్టీ కష్ట కాలంలో ఉన్న సమయంలో పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు అడ్డుగా ఉండి బద్వేల్ నియోజకవర్గం లో పార్టీని నడిపించిన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ బద్వేల్ టిడిపి శ్రేణులు మరిచిపోలేమన్నారు. ప్రజలు అడిగిందే తడవుగా అభివృద్ధి పనులు చేయిస్తున్న వీరారెడ్డి వారసులు రితీష్ రెడ్డి తోనే పార్టీ నాయకులు కార్యకర్తలు ఓటర్లు ఉన్నారని విషయాన్ని ఆయన గుర్తు చేశారు. టిడిపి మండల అధ్యక్షులు సుధాకర్ రెడ్డి సంపూర్ణ మద్దతుగా ఇస్తున్నట్లు ప్రకటించారు..



## అయ్యప్ప స్వామి వారి వస్త్రాలను ఉచితంగా అందజేస్తున్న ధర్మిశెట్టి అశోక్ రాయల్

బద్వేల్ నియోజకవర్గం, రిపోర్టర్ శివారెడ్డి(శుభోదయం న్యూస్):




కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలంలో కార్తీక మాస ప్రారంభం సందర్భంగా అక్కడ ఉండే భక్తులు అయ్యప్ప స్వామి వారి వస్త్రాలను ధరిస్తారు.. వీటిని బ్రహ్మంగారి మఠం బలిజ సంఘం అధ్యక్షుడు ధర్మిశెట్టి అశోక్ రాయల్ ఉచితంగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి బద్వేల్ పట్టణ అధ్యక్షులు ధర్మిశెట్టి వెంకటేశ్వర్లు గురు స్వామి శివకుమార్ వెంకటసుబ్బయ్య మొదలైన వారు పాల్గొన్నారు..

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పుస్తక ఆవిష్కరణ

ఏలూరు జిల్లా, ప్రతినిధి -ప్రసాద్(శుభోదయం న్యూస్):




ఏలూరు జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చింతలపూడి నందు వృక్ష శాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తున్న డా.వి.మదన్ మోహన్ రచించిన జీనోమిక్ సీక్వెన్సింగ్–బయో ఇన్ఫర్మాటిక్స్ పుస్తకాన్ని ప్రిన్సిపాల్ డా. పి. శ్రీనివాస రావు ఆవిష్కరించారు. సీనియర్ అధ్యాపకులుగా పనిచేస్తూ, విద్యార్థులు సౌకర్యార్థం ఆధునిక సమాచారాన్ని పుస్తకరూపంలో ప్రచురించడం అభినందనీయం అని, ఇలాంటివి చదవడం ద్వారా సరికొత్త విషయాలు నేర్చుకోవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపక బృందం, విద్యార్థులు అధ్యాపకులు మదన్ మోహనన్ కి అభినందనలు తెలియజేశారు.

## త్రాగునీటి కుళాయిల్లో పురుగులు గ్రామస్థుల ఆందోళన

ఏలూరు జిల్లా, ప్రతినిధి- ప్రసాద్(శుభోదయం న్యూస్):



ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరం పంచాయతీ పరిధిలోని ఫాతిమాపురం గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని త్రాగునీటి కుళాయిల్లో గత మూడు నెలలుగా పురుగులు (తల కప్పలు) వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థుల సమాచారం ప్రకారం, ఈ సమస్యపై పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. త్రాగునీటిలో కలుషితత కారణంగా ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, చిన్నారులు మరియు వృద్ధులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు తెలిపారు. ప్రమాదకరమైన పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే స్పందించి నీటి సరఫరా వ్యవస్థను పరిశీలించి, శుభ్రపరచే చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## షెడ్యూల్ కులాల సంఘం కమిటీ మెంబర్ గా రోషన్ కుమార్

ఏలూరు జిల్లా, ప్రతినిధి -ప్రసాద్ (శుభోదయం న్యూస్):



ఏలూరు జిల్లా చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కు కీలక పదవి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభలో షెడ్యూల్ కులాల సంఘం కమిటీ మెంబర్ గా చింతలపూడి నియోజకవర్గ ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ నియమితులయ్యారు. ఈ నియామకానికి సంబంధించిన ఉత్తర్వులు గురువారం వెలువడ్డాయి. ఈ సందర్భంగా నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు మరియు నగర ప్రజలు ఎమ్మెల్యే రోషన్ కుమార్ కు శుభాకాంక్షలు తెలియజేస్తూ జేజేలు పలికారు

## పిడుగురాళ్ల పట్టణంలోని బైపాస్ రోడ్ లో రైల్వే ఓవర్ బ్రిడ్జి క్రింద మృత దేహం

పిడుగురాళ్ల టౌన్, రిపోర్టర్ శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్):

తుపాకుల తేజ కనకారావు 25 సంవత్సరాలు దాసరి, కొత్త గణేషునిపాడు గ్రామం మాచవరం మండలం ఓవర్ బ్రిడ్జి కింద రైలు పట్టాల మీద మృతదేహం ఉన్నది పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది



## నేడు జాబ్ మేళా౦ నిరుద్యోగ యువత తప్పక సద్వినియోగం చేసుకోవాలి ఎమ్మెల్యే చిర్రి

పోలవరం ప్రతినిధి(శుభోదయం న్యూస్):




నేడు కొయ్యలగూడెం ప్రకాశం డిగ్రీ కళాశాలలో జరగబోయే మెగా జాబ్ మేళాను తప్పని సరిగా సద్వినియోగం చేసుకోవాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు నిరుద్యోగ యువతను కోరారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ జాబ్ మేళాలో నియోజకవర్గం లోని ఏడు మండలాల నుండి నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ జాబ్ మేళాకు పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లమో, డిగ్రీ, డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ విద్యార్హతలతో అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకుని ఉద్యోగ మేళాకు తప్పక హాజరై తమ భవిష్యత్తును మలుచుకోవాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సూచించారు.

## రాళ్లపాడు జలాశయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

లింగసముద్రం కె సురేష్(శుభోదయం న్యూస్):



నెల్లూరు జిల్లా లింగసముద్రం మండలం లోని రాళ్లపాడు జలాశయాన్ని కందుకూరు నియోజకవర్గం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సందర్శించి ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుంది త్వరలో రాళ్లపాడు జలాశయం నుండి రైతులకు నీరు అందిచి నార్లు పోసుకునే విధంగా చేస్తామని అదేవిధంగా సోమశిల జలాశయం నుండి 1.5 టిఎంసి నీరుని తీసుకొని వచ్చి రైతులకు ఎలాంటి ఆటంకం లేకుండా సమృద్ధిగా పంటలు పండిస్తామని చెప్పారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకి నీటిమట్టం 16.6 అడుగులుఉన్నది దిగుఉన్న ప్రాంతం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు దిగువనున్న ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించి వారిని అల్లర్టచేయలని అధికారులను ఆదేశించారు.

## ఘనంగా సదర్ ఉత్సవాలు

తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్(శుభోదయం న్యూస్):



అత్యంత వైభవంగా జరుపుకునే సదర్ ఉత్సవాలు..యాదవులకు ఎంతో ప్రతిష్టాత్మకమైనవని యాదవ సంఘం నాయకులు పొల్లం రాజు యాదవ్,నాగేష్ యాదవ్ అన్నారు. కంటోన్మెంటులో పొల్ల నాగేష్ యాదవ్, రాజు యాదవ్ ఆధ్వర్యంలో సదరు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఈ సందర్భంగా దున్నపోతులకు పూలమాలవేసి సదర్ శుభాకాంక్షలు అనంతరం మాట్లాడుతూ..ప్రతి ఏటా దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే సదరు ఉత్సవాలు ఎంతో ఘనంగా నిర్వహిస్తారని తెలిపారు. యాదవుల సంక్షేమానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పొలం మదన్ యాదవ్, నరేష్ యాదవ్, బబ్లు యాదవ్, హరీష్ యాదవ్, సాయి యాదవ్, భారతీ యాదవ్, పృథ్వి యాదవ్, పవన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## ోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న మైనార్టీ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు షేక్ గయాజ్.

పామూరు మండల, రిపోర్టర్ బండి రమేష్(శుభోదయం న్యూస్):



మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలతో కనిగిరి నియోజకవర్గం వైఎస్ఆర్సిపి పార్టీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ సారథ్యంలో పామూరు మండలం వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి సూచనలతో పామూరు పట్టణం లోని పలుచోట్లకోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించిన వైఎస్ఆర్సిపి నాయకులు కనిగిరి నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ గయాజ్. ఈ కార్యక్రమానికి ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు ముస్లిం మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీకమాస వన సమారాధన కరపత్రాలు ఆవిష్కరణ

కారంపూడి, ఆర్కే జర్నలిస్ట్ (శుభోదయం న్యూస్):



కారంపూడి పట్టణంలో గురువారం మండల శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీకమాస వన సమారాధన కు సంబంధించిన కరపత్రాలను శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ ఆదివారం స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి సింగరట్ల దేవస్థానంలో కార్తీకమాస వనభోజనాలను నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు.ఆదివారం ఉదయం 8 గంటలకు అంకాలమ్మ తల్లి గుడి వద్ద నుండి బస్సులు బయలు దేరతాయి అన్నారు.ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతములు, మధ్యాహ్నం 12 గంటలకు కార్తీకమాస వనభోజనాలు, అనంతరం సంగీత విభావరి కార్యక్రమాలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వన సమారాధన కమిటీ ప్రకటించింది. కార్యక్రమం సాఫల్యవంతం కావాలంటూ ఆర్యవైశ్య పెద్దలు, యువజన సంఘ నాయకులు పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఎస్.పి.ఆర్. కృష్ణ,శ్రీ వాసవి అన్న ప్రసాదం కమిటీ ఫౌండర్ బవిరిశెట్టి రామారావు,ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు సముద్రాల పవన్ సాయి, సంఘం నాయకులు చలవాది మాధవ్, సురే సుబ్రహ్మణ్యం, ఆతుకూరి గోపి,ఆర్యవైశ్య పెద్దలు చీతిరాల వెంకట కోటేశ్వరరావు, యక్కల శ్రీనివాసరావు, కొత్త నరసింహారావు యువజన నాయకులు కరాలపాటి సాయి తదితరులు పాల్గొన్నారు.

# అధిక వర్షాలలో ఉద్యాన పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు





పామూరు మండల, రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్):

అధిక వర్షాలలో ఉద్యాన పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యనాధికారిణి కుసుమ అన్నారు. గురువారం వర్గం పల్లి గ్రామంలో వర్ష ప్రభావానికి లోనైన టువంటి మిరప, బత్తాయి తోటలను పరిశీలించారు. అధిక వర్షాల్లో ఉద్యాన పంటల్లో (మిరప మరియు కూరగాయలు) తీసుకోవలసిన జాగ్రత్తలు రైతులకు వివరించడం జరిగినది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల లో పొలంలోని నీలువ నీటిని ఎప్పటికప్పుడు పొలంలో నుంచి బయటికి పంపించే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు చుట్టూ మట్టిని ఎగదోయాలి.ఉరకెత్తి తలలు వాల్చినట్లయితే వెంటనే తేరుకోవడానికి లీటరు నీటికి 10 గ్రా? యూరియా కలిపిన ద్రావణాన్ని వారంలో 2 సార్లు పిచికారి చేయాలి.వడలిన మొక్కలకు లీటరు నీటికి 5 గ్రా? మెగ్నీషియం సల్ఫేటు కలిపిన ద్రావణం పిచికారి చేయాలన్నారు. ఇనుప ధాతులోపంతో మొక్కలు పాలిపోయినట్లు కనబడితే 10 లీటర్ల నీటికి 50గ్రా? అన్న భేదితో పాటు ఒక్క నిమ్మ చెక్క రసం కలిపి పిచికారి చేయాలన్నారు. వర్షం కొంత మేరకు తగ్గిన వెంటనే పై పాటుగా ఎరువులు అనగా మైక్రో న్యూట్రియన్స్ మిక్చర్ 5 గ్రాములు ఒక లీటర్ కి మరియు తెగుళ్ళ మందు అనగా బ్లైట్ టాక్స్ లేదా బావెస్టిన్ మూడు గ్రాములు ఒక లీటర్ కి పై పాటుగా వారానికి రెండుసార్లు పిచికారి చేసినట్లయితే తెగుళ్లను నివారిస్తూ పోషకాలను మొక్కలకు అందజేయవచ్చనన్నారు.

## సీజీ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే కందికుంట

తనకల్లు, రిపోర్టర్ రవీంద్ర (శుభోదయం న్యూస్):



తనకల్లు మండలంలోని చెన్నరాయ స్వామి గుడి ప్రాజెక్టు నిండిపోవడంతో కదిరి ఎమ్మెల్యే వెంకటప్రసాద్ గురువారం గేట్లు ఎత్తి వీటిని విడుదల చేశారు. ఈ నీరు పాపాగ్ని నదిగుండా ప్రవహించి వెలిగల్లూ ప్రాజెక్టులోకి పోతాయి. సి జి ప్రాజెక్ట్ ఆయకట్టు కింద రైతులు వరి సాగు చేస్తారు. కార్యక్రమంలో క్లస్టర్, యూనిట్ ఇంచార్జి లు, బూత్ కన్వీనర్ లు, మార్కెట్ యార్డ్ చైర్మన్ వైస్ చైర్మన్, సింగిల్ విండో చైర్మన్, సెల్, సెల్, సెల్, మైనార్టీ సెల్, తెలుగు యువత,తెలుగు రైతు, మహిళా అధ్యక్షులు, రైతు సోదరులు నాయకులు కార్యకర్తలు అభిమానులు, పాల్గొన్నారు.

## తారు రోడ్డు వేసి వాహనదారును, ప్రమాదాల నుండి ప్రజలను కాపాడాలి.. సిపిఎం

పామూరు మండల, రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్):




సిఎస్పురం రోడ్డులో కరెంట్ ఆఫీస్ దగ్గర ఆర్ అండ్ బి రోడ్డు గుంతల పడి వర్షాలకు నీరు చేరి ప్రజలకు వాహనదారులకు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తు ఒదని ఈ మధ్యకాలంలో బైక్ మీద నుండి పడి అనేకమంది గాయాలయ్యాయి పాదాచారులకు, ఆటో, వాహనదారులకు చాలా అసౌకర్యంగా ఉందని వెంటనే ఆర్ అండ్ బి అధికారులు, ప్రభుత్వం జోక్యం చేసుకొని గుంతలను పూడ్చి రోడ్డు వేయాలని పామూరు చుట్టు వేసిన హైవే వాహనాలు వల్ల ఆర్ అండ్ రోడ్లు, బాగా దెబ్బతిన్నాయని గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గరనుండినుచ్చు పొద జంక్షన్ రోడ్డు , మరియు నెల్లూరు రోడ్డు, సిఎస్పురం రోడ్లు గుంతలపడి వర్షపు నీరు చేరి ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని వెంటనే ఆర్ అండ్ బి, హైవే అధికారులు జోక్యం చేసుకొని ఈ రోడ్లను బాగు చేయించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ అనీఫ్ అన్నారు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు వెంటనే గుంతలు పూడ్చి తారు రోడ్డు వేయాలని వాహనదారులకు ప్రజలకు ప్రమాదాల నుండి కాపాడాలని అన్నారు వేయాలని లేనిపక్షంలో ప్రజలను సమీకరించి ఆందోళన నిర్వహిస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోమ్మా లపాటి మాల్యాద్రి మండల కార్యదర్శి ఖాదర్ బాషా, గౌస భాష, సిహెచ్ వెంకటేశ్వర్లు,కే శంకర్, అల్లా బక్ష పి శ్రీను సిహెచ్ వెంకటేశ్వర్లు సయ్యద్ షర్మిల సయ్యద్ రమీజా వై వి నారాయణ మహబూబ్ పీరా తదితరులు పాల్గొన్నారు.

# రైతులు అధైర్య పడవద్దు ప్రభుత్వం అండగా ఉంటుంది

రవీంద్రా రెడ్డి

బద్వేల్ నియోజకవర్గం, రిపోర్టర్ శివారెడ్డి (శుభోదయం న్యూస్):

బద్వేల్ నియోజకవర్గంలో ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన ఈ క్రాప్ చేయించుకున్న రైతులు అధైర్య పడవద్దని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని వాటి ద్వారా రైతుల ధాన్యాన్ని ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తుందన్నారు.. అదేవిధంగా గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో కూడా పలు ధాన్యాలను కొనుగోలు చేస్తుందన్నారు .ఈ క్రాప్ చేసుకున్న ప్రతి రైతుకు ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. మద్దతు ధరలకు పంటలు అమ్ముకోవాలంటే తప్పనిసరిగా "ఈ–పంట చేసుకొని ఉండాలని ఆయన సూచించారు.. ధాన్యం నిల్వ ఉంచేందుకు నియోజవర్గంలో గోడౌన్స్ కూడా ఏర్పాటు చేశామన్నారు.. ప్రతి రైతులు దాన్యం అమ్ముకోవాలంటే వారికి సంబంధించిన రైతు భరోసా కేంద్రానికి వెళ్లి సంప్రదించాలన్నారు. రైతుల అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇకపై రైతన్న పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించదన్న బెంగ లేదన్నారు. 2025–26 ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే వ్యవసాయ ఉత్పత్తులకు ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటన చేసిందన్నారు కావున రైతులు ఎటువంటి అధైర్య పడవలసిన అవసరం లేదని ఆయన అన్నారు..



# ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఆధార్ అప్డేట్ తప్పనిసరి





**నల్లచెరువు మండలం, రిపోర్టర్ – మాలిక్ బాషా (శుభోదయం న్యూస్):**

ప్రతి ఒక్కరూ ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఆధార్ అప్డేట్ తప్పనిసరిగా చేసుకోవాలని ఎంపీడీవో రామకృష్ణ పేర్కొన్నారు.మండల కేంద్రంలోని బ్రిలియంట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల,గార్డెన్ పబ్లిక్ స్కూల్లలో ఏర్పాటుచేసిన ఆధార్ అప్డేట్ క్యాంపులను గురువారం ఎంపీడీవో రామకృష్ణ,మండల విద్యాధికారి తిరుపాల్ నాయక్ లు పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ప్రతి ఒక్కరు తమ ఆధార్ కార్డు అప్డేట్ తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు.ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడంలో ఆధార్ ముఖ్య పాత్ర పోషిస్తుందని,వివరాలు తప్పుగా ఉండటం వల్ల అనేక మందికి సమస్యలు ఎదురవుతున్నాయని ఆయన తెలిపారు.అందుకే ఐదు సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరు తక్షణమే తమ సమీపంలోని సచివాలయాలు లేక ఆధార్ కేంద్రాలలో సదుపాయం ఉన్న కేంద్రంలో సంప్రదించి ఆధార్ కార్డు అప్డేట్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సచివాలయంలో ఆధార్ అప్డేట్ సెంటర్ ఏర్పాటు చేసిందన్నారు.పాఠశాలల్లో విద్యార్థులకు ఆధార్ అప్డేట్ చేయుటకు మండల వ్యాప్తంగా ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ క్యాంపులలో విద్యార్థులకు ఉపాధ్యాయులు దగ్గరుండి ఆధార్ కార్డులను అప్డేట్ చేయించాలని తెలిపారు.కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు తిరుపాల్ నాయక్ చెన్నకేశవులు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు,మహిళా పోలీసులు పాఠశాలల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

**కరీంనగర్ :** రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. గురువారం రామడుగు మండలం వెదిర రైతు వేదిక ప్రాంగణంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ– టీ సెర్ప్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్.. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ. ప్రభుత్వం వరి ధాన్యం క్వింటాలుకు ఏ గ్రేడ్ రకం రూ. 2389, సాధారణ రకం ధాన్యానికి రూ. 2369 అందిస్తుందని..రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం మద్దతు ధరతో పాటు సన్న రకాలకు అదనంగా క్వింటాకు రూ. 500 బోనస్ అందిస్తుందని పేర్కొన్నారు. రైతులు తమ పంటను తక్కువ ధరకు వ్యాపారులకు అమ్ముకొని నష్టపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, ప్యాడి క్లీనర్లు, టార్పాలిన్లు, గన్ని సంచులు తదితర వసతులు కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అన్ని వసతులు కల్పిస్తుందన్నారు. సన్న రకం వడ్లు పండించే రైతులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా 500 ను బోనస్ గా ఇస్తుందన్నారు.రైతులకు



ఇబ్బంది లేకుండా కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అనిల్ ప్రకాష్, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశలో క్రమశిక్షణ చాలా ముఖ్యం

**సైబర్ నేరాల పట్ల మీరు మీ కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలి**

**సిద్దిపేట :** గుర్తుతెలియని అపరిచితుల వ్యక్తులు యొక్క మాటలు నమ్మి మోసపోవద్దు గురుకృప జూనియర్ కాలేజ్ విద్యార్థిని విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, షీటీమ్ నిర్వహిస్తున్న విధుల గురించి, షీటీమ్ ద్వారా ఎలా రక్షణ పొందొచ్చు అనే అంశాల గురించి వన్ టౌన్ ఎస్ఐ జమీరుద్దీన్ అవగాహన కల్పించారు. ర్యాగింగ్, ఇవిటీజింగ్, పోక్సో, షీ టీమ్స్, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు,నూతన చట్టాల గురించి, మరియు అపరిచిత వ్యక్తుల యొక్క ఫోన్ కాల్స్ మరియు మాటలు నమ్మవద్దు, సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుందిమహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం మహిళల భద్రత మా ముఖ్య బాధ్యత. చదువుకునే సమయములో చెడు అలవాట్లకు బానిస కావొద్దు అన్నారు, ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించాలని తెలిపారు, డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. చదువుకోవడం వలన భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని అన్నారు. పిల్లలను చదివించటానికి తల్లిదండ్రులు చేస్తున్న కష్టాన్ని మనసులో పెట్టుకొని చదువుపై శ్రద్ధ వహించాలని మరియు సామాజిక రుగ్మతల గురించి సెల్ఫోన్ కు ఎంత దూరం ఉంటే అంత మంచిది సెల్ ఫోన్ వల్ల ఎంత మంచి ఉందో అంత చెడు ఉంది దానికి అలవాటు పడి



బానిసలు కావద్దు విద్యార్థి దశ చాలా కీలక కష్టపడే తత్వం కష్టపడి చదువుకోవడం చాలా ముఖ్యమని మహిళలను ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మరియు అవహేళనగా మాట్లాడిన వెంటనే డయల్ 100 లేదా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ షీటీమ్ నెంబర్ 8712667434 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సమాచార అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. మరియు నూతన చట్టాల గురించి నూతన చట్టాలలో మహిళల రక్షణకు పెద్దపీట వేయడం జరిగిందని అవగాహన కల్పించిన.వన్ టౌన్ ఎస్ఐ జమీరుద్దీన్, సిద్దిపేట షీటీమ్ ఏఎస్ఐ కిషన్, మహిళ కానిస్టేబుళ్లు రజని, మమత, కానిస్టేబుళ్లు ప్రవీణ్, లక్ష్మీనారాయణ, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఏఎస్ఐ ఓదేలు.ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపల్ కృష్ణమూర్తి శర్మ మరియు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

**పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం**

**సీపీ గౌష్ ఆలం**

**కరీంనగర్ :** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం నాడు పోలీసు పరేడ్ గ్రౌండ్ నందు విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించినట్లు కరీంనగర్ పోలీసు కమిషనర్ సీపీ గౌష్ ఆలం తెలిపారు. నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ఓపెన్ హౌస్ ద్వారా విద్యార్థులకు పోలీసు వ్యవస్థ పనితీరు, విధి నిర్వహణలో ఉపయోగించే వివిధ పరికరాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా, డాగ్ స్క్వాడ్ (పోలీసు జాగిలాలు), ఆయుధాలు, అన్ని రకాల తుపాకులు, అల్లర్ల నియంత్రణకు వినియోగించే స్మోక్ గన్, షెల్స్, బాంబు నిర్వీర్య విభాగం యొక్క పని విధానాన్ని వివరించారు. అలాగే, డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు, పోలీసులు వినియోగించే కమాండ్ కంట్రోల్ వాహనం, అల్లరిమూకలను చెదరగొట్టేందుకు వినియోగించే స్మోక్ షెల్స్ ను పేల్చేందుకు వీలుగా వుండే వజ్ర వాహనంతో పాటు ప్రదర్శనలో ఉంచారు. షీ టీం, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్, యాంటీ నార్కోటిక్ సెల్, ట్రాఫిక్ విభాగానికి సంబంధించిన స్టాల్స్‌ను ఏర్పాటు చేసి, విద్యార్థులకు వాటి గురించి పూర్తి వివరాలు అందించారు. సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేరం జరిగినట్లయితే వెంటనే ఫిర్యాదు చేసే విధానాలు తెలిపే స్టాల్‌ను విద్యార్థులు ఆసక్తిగా సందర్శించారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల లో ప్రజలను భాగస్వామ్యం చేసే ఉద్దేశ్యంతో అక్టోబర్ 31వ తేదీ వరకు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ శ్రీ గౌష్ ఆలం



తెలిపారు. ఈ వారోత్సవాలను విజయవంతం చేయడానికి ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు ఈ పోటీలలో కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## పత్తి పంటను సందర్శించిన వ్యవసాయ అధికారి డి జవహర్ లాల్ నాయక్

**దోర్నాల మండల: రిపోర్టర్ ఆవులయ్య(శుభోదయం న్యూస్):**




ప్రకాశం జిల్లా దోర్నాల మండలం ఈ రోజు అనగా తేది :23.10.2025 న దోర్నాల మండలం లోని కటాకనిపల్లి మరియు చిన్నదోర్నాల గ్రామ లలో గత రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు నష్టమైన పత్తి పంట ను మండల వ్యవసాయ అధికారి డి. జవహర్ లాల్ నాయక్ పంటలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేయడం జరిగింది. ప్రస్తుతం పొలం లో ఉన్న నీటిని కాలువల ద్వారా బయటకు తీసివేసి, వర్షలు తగ్గిన తరువాత ఎకరానికి 20 కేజీ ల యూరియా మరియు 25 కేజీ ల పోటాష్ ఎరువు ను పంట కు వేసినట్లయి తే మొక్కలకు పోషకాలు బాగా అంది మొక్కలు చని పోకుండా ఉంటుందని రైతులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో రాజేంద్ర ప్రసాద్, శిరీష రైతులు పాల్గొన్నారు.

## దోర్నాల మండలం నూతన తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ బాబుకు ఘన సన్మానం

**దోర్నాల మండలం, రిపోర్టర్ ఆవులయ్య (శుభోదయం న్యూస్):**



ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాల మండల తెలుగుదేశంపార్టీ కార్యాలయం ప్రకటించిన. ఎర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ఆధ్వర్యంలో ఎర్రగొండపాలెం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో దోర్నాల మండల తెలుగుదేశం పార్టీ నూతనఅధ్యక్షులుగా షేక్ మాబు ఏకగ్రీవంగాఎన్నికయ్యారు. ఈసందర్భంగా షేక్ మాబు ను దోర్నాల మండల తెలుగుదేశంపార్టీ నాయకులు ఈదర మల్లయ్య, జెడిలక్ష్మయ్య, జనసేన పార్టీ నాయకులు గుర్రాల ప్రసాదు, దోర్నాల మండల బిజెపిమాజీ అధ్యక్షుడు సురవరం గండి వీరారెడ్డి, దూదేకుల దర్గయ్య, షేక్ మౌలాలి, దొడ్డ శేషాద్రి, పూలమాలలతో శాలువలతో ఘనంగా గురువారం సన్మానించారు.ఈ కార్యక్రమంలో కూటమి పార్టీనాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## జిబిఎల్ - యూకే ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరము

**కర్నూలు జిల్లా, స్టాఫ్ రిపోర్టర్ పి నాగరత్నం(శుభోదయం న్యూస్):**



సి.బెళగల్ మండలంలో శ్రీ గొల్ల బుడ్డన్న గారి లక్ష్మమ్మ – ఉదయ్ కుమార్ స్మారక సంస్థ ఆధ్వర్యంలో బురాన్ దొడ్డి జిల్లాపరిషత్ పాఠశాల లో మెగా నేత్ర వైద్య పరీక్ష మరియు అవగాహనా సదస్సు నిర్వహించారు. అధిక సెల్ ఫోన్ వాడకం వల్ల పిల్లలో నేత్ర సంబంధ సమస్యలు విరివిగా పెరుగుతున్నాయి. మండలంలో వివిధ సామజిక కార్యక్రమాలు నిర్వహిస్తోన్న జి.బి. యల్ సంస్థ వ్యవస్థాపకులు చంద్రశేఖర్, అధ్యక్షులు డా. శ్రీరాములు, అధ్యక్షులు డా.తరుణ్ కుమార్ తరుపున డా. ప్రియాంక, డా. శ్రావణి, ఆప్తో మెట్రి టెక్నీషియన్ల రాజేష్, రవి కుమార్ పాల్గొని 260 మంది విద్యార్థులకు స్క్రీనింగ్ నిర్వహించారు. దృష్టి సంబంధిత వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు,సంస్థ ప్రతినిధులు వీరకుమార్ కోశాధికారి, ప్రహ్లాదుడు కార్యదర్శి, నరసింహుడు, హోటల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## మండలంలో ఎన్.టి.ఏ. సభ్యత్వ నమోదు కార్యక్రమం.

**తనకల్లు, రిపోర్టు రవీంద్ర(శుభోదయం న్యూస్):**




తనకల్లు మండల కేంద్రంలోని మండల విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా గురువారం ఎన్.టి.ఏ. సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. మోడల్ ప్రైమరీ స్కూల్ తనకల్లు నల్లగుట్లపల్లి బొంతలపల్లి,చీకటి మానుపల్లి మార్పుడి వాండ్ల పల్లి, ముత్యాల వాండ్ల పల్లి, గ్రామాలలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు కార్యదర్శి పి. శివశంకర్ మాట్లాడుతూ సకాలంలో పిఆర్సి, డి ఎ,అరియర్స్ సరెండర్ లీవులు మంజూరు చేయాలని తెలియజేశారు.ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డి.ఎ పట్ల కూటమి ప్రభుత్వం పై రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అందరూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి లలితమ్మ, మండలంలోని వివిధ గ్రామాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# బాక్సాఫీస్ సెన్సేషన్‌గా ప్రదీప్.. వరుసగా మూడో సెంచరీతో రికార్డు

కాస్త నెగెటివ్ టాక్ వచ్చిందంటే సినిమా బండి ముందుకెళ్లడం కష్టమే! కానీ ప్రదీప్ రంగనాథన్ మాత్రం మిక్స్‌డ్ టాక్‌నే ఇంజనుగా మార్చుకుని రయ్యిమని బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్నాడు. అతడు ప్రధాన పాత్రలో నటించిన డ్యూడ్ సినిమా ఐదు రోజుల్లోనే సెంచరీ కొట్టేసింది. బ్లాక్‌బస్టర్ దివాళీ సీజన్ అంటూ రూ.100 కోట్ల పోస్టర్‌ను మైత్రీ మూవీ మేకర్స్ సోషల్ మీడియాలో రిలీజ్ చేసింది. మూడు సినిమాలకు వరుస సెంచరీ సాధించిన హ్యాట్రిక్ హీరోగా ప్రదీప్ చరిత్ర సృష్టించాడు. డ్యూడ్ సినిమాలో మమిత బైజు హీరోయిన్‌గా నటించగా శరత్‌కుమార్ కీలక పాత్ర పోషించాడు. సినిమా ప్రదీప్ రంగనాథన్.. ఎల్‌కేజీ సినిమాకు డైలాగ్స్ రాశాడు. కోమలి సినిమాతో దర్శకుడిగా మారాడు. ఇందులో అతిథి పాత్రలోనూ మెరిశాడు. లవ్ టుడే మూవీతో హీరోగా ఎంట్రీ ఇచ్చాడు. స్వీయదర్శకత్వం వహించిన ఈ సినిమా వంద కోట్లపైనే వసూళ్లు రాబట్టింది. రెండో సినిమా డ్రాగన్ సైతం సెంచరీ దాటేసి ఏకంగా రూ.150 కోట్ల కలెక్షన్స్ కొల్లగొట్టింది. ముచ్చటగా మూడో సినిమా కూడా సెంచరీ దాటేసింది. మరి డ్యూడ్ ఇంకా ఎన్ని రికార్డులు తిరగరాస్తుందో చూడాలి!



# ఇంటి పేరు మార్చిన హన్సిక


సెలబ్రిటీల సోషల్ మీడియా అకౌంట్లు ఇప్పుడు వారి పర్సనల్ డైరీలు లాగా మారిపోయాయి. చిన్న చేంజ్ కూడా పెద్ద వార్తలకు దారితీస్తుంది. అలాంటి సందర్భంలో స్టార్ హీరోయిన్ హన్సిక మోత్వాని చేసిన పని ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కొంతకాలంగా మ్యారేజ్ లైఫ్‌లో ఇబ్బందులు వచ్చాయనే రూమర్స్ వినిపిస్తున్న సమయంలో, హన్సిక తన ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో చిన్న మార్పు చేసింది. చాలా మంది దీన్ని విడాకుల రూమర్స్‌తో లింక్ చేశారు. హన్సిక ఈ స్పెల్లింగ్ మార్పు సడెన్ నిర్ణయం కాదని, దీని వెనుక తల్లి మోనా మోత్వాని ఉన్నారని తెలుస్తుంది. తల్లికి న్యూమరాలజీపై విశ్వాసం కలిగివుండటం, ఫ్యూచర్‌కు పాజిటివ్ ఎనర్జీ తెచ్చేలా పేరు మార్చే ఆలోచన చేసినట్టు హన్సిక వివరించింది. తల్లీకూతుళ్ల మధ్య పెద్ద చర్చలు, గొడవలు కూడా జరిగాయని, చివరికి తల్లి చెప్పిన మేరకు ఈ మార్పుకు ఓకే చెప్పానని హన్సిక పేర్కొంది. ఇకపై తనను ఇదే స్పెల్లింగ్‌తో పిలవాలని కోరిన హన్సిక.. మిగతాది నా పర్సనల్ లైఫ్ అంటూ సరదాగా ముగించింది. ఇక హన్సిక, బిజినెస్ మ్యాన్ సోహైల్ ఖతురియాతో 2022 డిసెంబర్‌లో జైపూర్‌లో గ్రాండ్ గా వివాహం చేసుకున్నారు. వారి లవ్ స్టోరీని "లవ్, షాదీ అండ్ డ్రామా" పేరుతో డాక్యు-సిరీస్‌గా కూడా రిలీజ్ చేశారు. అయితే, 2025 నుండి జంట మధ్య గొడవలు జరిగాయని రూమర్స్ మొదలయ్యాయి. హన్సిక తన పెళ్లి ఫోటోలన్నీ ఇన్‌స్టాగ్రామ్ నుండి డిలీట్/ఆర్కైవ్ చేయడం, భర్త సోహైల్ ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్‌ను ప్రైవేట్‌లోకి మార్చడం, వారిద్దరూ పండుగల సమయంలో వేర్వేరుగా కనిపించడం ఈ రూమర్స్‌ను మరింత బలపరచింది. వారి విడాకులపై ఇప్పటి వరకు ఎలాంటి క్లారిటీ లేదు. ఇక హన్సిక తన కెరీర్‌ను చైల్డ్ ఆర్టిస్ట్‌గా ప్రారంభించింది. "షక లక బూమ్ బూమ్ సీరియల్", "కోయి మిల్ గయా" వంటి సినిమాలతో ప్రారంభించారు.



# పక్కా మాస్ బీట్‌తో 'సూపర్ డూపర్' సాంగ్

'మాస్ జాతర' చిత్రం నుండి ఇప్పటికే విడుదలైన 'తు మేరా లవర్', 'ఓలే ఓలే', 'హుడియో హుడియో' పాటలు శ్రోతలను విశేషంగా ఆకట్టుకొని, సామాజిక మాధ్యమాల్లో ఉధ్రుత లూగించాయి. తాజాగా చిత్ర బృందం నాలుగో గీతంగా ఉత్సాహభరితమైన మాస్ పాట 'సూపర్ డూపర్'ను విడుదల చేసింది. రవితేజ మాస్‌కి, శ్రీలీల ఎనర్జీకి తగ్గట్టుగా స్వరపరిచిన ఈ ట్యూన్ అందరినీ కట్టిపడేస్తోంది. 'ఈ చిత్రాన్ని, ఆల్బమ్‌ని మరింతగా ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లేలా ఈ 'సూపర్ డూపర్' గీతముంది. రెండు ఉత్సాహభరితమైన పాటలు, ఓ మంచి మెలోడీతో ఇప్పటికే 'మాస్ జాతర' ఆల్బమ్ ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. మునుపటి మాస్ మహారాజా రవితేజను గుర్తుచేసేలా, ఆయనకు మాత్రమే సాధ్యమయ్యే స్వాగ్ ఇందులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రీలీల తన అద్భుతమైన నృత్య ప్రదర్శనతో మరోసారి తెరపై వెలుగులు వెదజల్లారు. ఈ గీతాన్ని సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో తనదైన శైలిలో అద్భుతంగా స్వరపరిచారు. భీమ్స్ సిసిరోలియోతో కలిసి రోహిణి సోరట్ ఆలపించడం ఈ పాటకు మరింత హుషారుని తీసుకొని వచ్చింది. గీత రచయిత సురేష్ గంగుల అందరూ పాడుకునేలా ఉల్లాసభరితమైన సాహిత్యాన్ని అందించి ఆకట్టుకున్నారు' అని చిత్ర యూనిట్ తెలిపింది. తెలుగులో ఎన్నో విజయవంతమైన చిత్రాలకు రచయితగా పనిచేసిన భాను భోగవరపు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం ఈనెల 31న విడుదల కానుంది.

# 'టాక్సిక్' షూటింగ్‌కు బ్రేక్




గత కొద్ది కాలంగా హీరోలు నిర్మాతలుగా, దర్శకులుగా రాణిస్తున్నారు. తమ సినిమాలను తామే తెరకెక్కించుకుంటూ రిస్క్ తీసుకుంటున్నారు. ముందుగా డైరెక్టర్లు ఫిక్స్ చేసుకున్నప్పటికీ షూటింగ్ దశలో ఉన్నప్పుడు పలు మనస్పర్థలు తలెత్తడంతో ఆ ప్రాజెక్ట్ నుంచి తప్పుకుంటున్నారు. దీంతో షూటింగ్‌లు ఆగిపోతున్నాయి. తాజాగా, యష్ హీరోగా చేస్తున్న 'టాక్సిక్' సినిమా విషయంలోనూ ఇలాంటి సమస్యలే తలెత్తినట్లు సమాచారం. దీంతో షూటింగ్ మధ్యలోనే ఆపేసినట్లు టాక్. ఈ సినిమాను తెరకెక్కిస్తున్న గీతూ మోహన్ దాస్ 'టాక్సిక్' నుంచి తప్పుకున్నట్లు టాక్. ఇప్పటివరకు ఆమె తీసిన ఫుటేజ్ చూసి యష్ నిరాశ పడినట్లు తెలుస్తోంది. అది నచ్చకపోవడంతో రిషూట్స్ చేస్తున్నారట. అయినా యష్ సంతృప్తి చెందక పోవడంతో పాటు షూట్ డిలే చేస్తున్నాడట. దీంతో ఇదంతా నచ్చక గీతూ తప్పుకోగా.. యష్ మెగా ఫోన్ పట్టబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. మిగిలిన సినిమాను తెరకెక్కించే పనిలో పడ్డారట. ఇందులో నిజమెంత అనేది తెలియనప్పటికీ యష్ రిస్క్ తీసుకోబోతున్నాడా? హిట్ అందుకుంటాడా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక హీరో విశాల్ సైతం ఇలాగే చేస్తున్నాడు. 'మకుటం' తెరకెక్కిస్తున్న దర్శకుడు రవి అరసుతో మనస్పర్థలు తలెత్తడంతో ఆయన ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నాడు. ఇక మిగిలిన సినిమా విశాల్ దర్శకత్వంలో రాబోతుంది. ఇక ఆయనను ఫాలో అవుతూ యష్ కూడా 'టాక్సిక్' విషయంలో రిస్క్ తీసుకోబోతున్నాడు.

## ప్రభాస్ ఫ్యాన్స్‌కు సర్‌ప్రైజ్ న్యూస్.. ఫౌజీలో కన్నడ భామ

గ్లోబల్ స్టార్ యాక్టర్ ప్రభాస్ నటిస్తోన్న ప్రాజెక్టుల్లో ఒకటి 'ఫౌజీ ఒకటి. హను రాఘవపూడి డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో ఇమాన్వీ ప్రభాస్‌కు జోడీగా నటిస్తోంది. ప్రభాస్ బర్త్ డే సందర్భంగా ఫౌజీ ఫస్ట్ లుక్ విడుదల చేయగా నెట్టింట వైరల్ అవుతోంది. కాగా ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర వార్త తెరపైకి వచ్చింది. శాండల్ వుడ్ భామ, సింగర్ చైత్ర జే అచర్ ఈ మూవీలో కీలక పాత్రలో నటిస్తోంది. పీరియాడిక్ యాక్షన్ రొమాంటిక్ డ్రామాలో నటిస్తున్నట్టు షేర్ చేసింది చైత్ర జే అచర్. సప్త సాగరదాచె ఎల్లో, 3 బీహెచ్‌కే సినిమాల్లో నటించింది. హనురాఘవపూడి అద్భుతమైన క్రియేషన్ ఫౌజీ అని చెప్పింది చైత్ర జే అచర్. ఈ బ్యూటీ సర్‌ప్రైజ్ అప్‌డేట్ షేర్ చేసి ప్రభాస్ అభిమానుల్లో జోష్ నింపుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని 2026 ఆగస్టులో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు. ప్రభాస్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. మారుతి డైరెక్షన్‌లో రాజాసాబ్ చేస్తున్నాడు. దీంతోపాటు సలార్ 2, కల్కి 2, స్పిరిట్ చిత్రాలు ట్రాక్‌పై ఉన్నాయి.

